విశాఖపట్టణం
శనివారం 25 జులై 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:175 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# ఇన్‌స్టాలో మోదీ క్రేజ్

## 12 గంటల్లోనే 1.1 మిలియన్ ఫాలోవర్లు

## డిజిటల్ మీడియాలో దుమ్మురేపుతున్న ప్రధాని

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



సోషల్ మీడియా ప్రపంచంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ క్రేజ్ మరోసారి హైలెట్‌గా నిలిచింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆయన ఫాలోవర్ల సంఖ్య నిమిషాల వ్యవధిలోనే రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. కేవలం 12 గంటల వ్యవధిలోనే ఏకంగా 1.1 మిలియన్ల ఫాలోవర్లు మోదీ ఖాతాకు పెరగడం డిజిటల్ మీడియాలో దుమ్మురేపుతుంది. గురువారం ..మిగతా 2లో



# రంగంలోకి కుంకీ ఏనుగులు

## పలమనేరు నుంచి మన్యం జిల్లాకు

## అడవి ఏనుగులు నియంత్రించేలా చర్యలు

## స్వాగతం పలికిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

(అమరావతి - జయజయహే)

విజయనగరం, మన్యం జిల్లాల్లో పంటపొలాల్ని నాశనం చేస్తున్న అడవి ఏనుగుల గుంపు కట్టడికి కుంకీ ఏనుగుల్ని పంపుతున్నట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. పలమనేరు నుంచి పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్తున్న కుంకీ ఏనుగులకు మంగళగిరి క్యాంపు కార్యాలయం వద్ద పవన్ కల్యాణ్ స్వాగతం పలికారు. కుంకీ ఏనుగులు జయంత్, అభిమన్యుకు ..మిగతా 3లో

# గిరిప్రదక్షిణకు ఏఐ

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యవేక్షణ

## 7 జోన్లు, 28 సెక్షన్లుగా విభజన

## బీచ్ రోడ్డులో నో వెహికల్ జోన్ అమలు

## అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహణకు ప్రాణాళిక

2


# అతిపెద్ద ధింసాతో ప్రధానికి ఘనస్వాగతం

## ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి 3లక్షల మంది హాజరయ్యే ఛాన్స్

## కూటమి నాయకులు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షించాలి

## భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ ఏర్పాట్లను సమీక్షించిన మంత్రి నారా లోకేష్





**భోగాపురం (విజయనగరం జిల్లా):**

ఉత్తరాంధ్రకే తలమానికంగా రూపుదిద్దుకున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం (భోగాపురం)ను ఆగస్టు 1వతేదీన ప్రధాని నరేంద్ర మోదీజీ జాతికి అంకితం చేస్తున్న నేపథ్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నభూతో నభవిష్యత్ అనే రీతిలో విజయవంతం చేయాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం పరిశీలించిన మంత్రి లోకేష్, అనంతరం సమీక్ష నిర్వహించారు. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి 3లక్షలమంది ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం, ప్రధాని మోదీజీ బహిరంగసభకు హాజరవుతారని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. కూటమి నాయకులు సమన్వయంతో పనిచేసి ప్రధాని సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రధాని మోదీజీకి ఘన స్వాగతం పలుకుతూ సుమారు 13వేలమందితో దేశంలోనే అతిపెద్ద ధింసా నృత్య ప్రదర్శనకు ఏర్పాట్లు చేయాలి. ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ సభకు హాజరయ్యే ప్రజలకోసం 36 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 5వేల బస్సులు రానున్నాయి. సభకు వచ్చేవారు బస్సు ఎక్కినప్పటినుంచి తిరిగి వెళ్లేవరకు ఎటువంటి లోటులేకుండా మండలస్థాయి లైజన్ ఆఫీసర్లు దగ్గరుండి చూసుకోవాలి. సభకు హాజరయ్యే వారందరికీ తాగునీరు, అల్పాహారం, ..మిగతా 2లో



# సైలెన్స్ పాలిటిక్స్..!

## జాతీయస్థాయి వివాదాస్పద అంశాలపై మౌనం

## ఏపీలో వైసీపీ, తెలంగాణలో బీఆర్ఎస్ సేమ్ టు సేమ్

## జాతీయ స్థాయి సమస్యలపై పోరుకు వెనకడుగు

## కేంద్రం పట్ల భయాందోళనలే కారణమా..?.. రాజకీయవర్గాల్లో చర్చ

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీ, కేంద్ర ప్రభుత్వ విద్యారంగ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు మిన్నంటుతున్నా, తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ప్రాంతీయ పార్టీలు బీఆర్ఎస్ , వైఎస్సార్‌సీపీ అనూహ్యంగా మౌనం వహించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ , వివిధ విద్యార్థి సంఘాలు రోడ్లెక్కి ఆందోళనలు నిర్వహిస్తున్నప్పటికీ, ఈ రెండు ప్రాంతీయ పార్టీలు మాత్రం క్రియాశీలక పోరాటాలకు దూరంగా ఉంటున్నాయి. యువత, ..మిగతా 2లో



# ఎన్టీఏపై ఉక్కుపాదం

## ప్రక్షాళన చేపట్టిన కేంద్రం

## 47 మంది అధికారులు తొలగింపు

## నివేదికల ఆధారంగా చర్యలు



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

నీట్ పేపర్ లీక్, పెరుగుతున్న విద్యార్థుల నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, శుక్రవారం కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నీట్ పేపర్ లీక్‌లో ప్రమేయం ఉన్న 47 మంది అధికారులను ..మిగతా 3లో



# నిరసనల హోరులో వందేమాతరం

## రాజ్యసభలో ప్రవేశపెట్టిన కేంద్రం

## నీట్‌పై లోక్ సభలో రభస

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)


జాతీయ గేయం 'వందేమాతరం'కు జాతీయ గీతంతో సమానంగా చట్టభద్రత కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో 'ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ హానర్ (అమెండ్‌మెంట్) బిల్లు, 2026'ను ప్రవేశపెట్టింది. నీట్-యుజి పేపర్ లీకేజీ వివాదంపై విపక్ష ఎంపీలు తీవ్రస్థాయిలో నినాదాలు చేస్తున్నప్పటికీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తరఫున హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఈ ప్రతిపాదనను సభ ముందుకు తెచ్చారు. ఈ నూతన ప్రతిపాదిత బిల్లు 1971 నాటి 'ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ హానర్ యాక్ట్'ను సవరిస్తుంది. ప్రస్తుతం ..మిగతా 2లో

# శ్రీవారి పుష్కరిణి మూసివేత

## ఆగస్టు 1 నుంచి 31 వరకు క్లోజ్

## నీటి శుద్ధి, మరమ్మతుల కోసమే

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



కలియుగ వైకుంఠమైన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి క్షేత్రంలో అత్యంత పవిత్రమైన స్వామి పుష్కరిణి నీటి శ్సుద్ధి, మరమ్మతు పనులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సమాయత్తమవుతోంది. ప్రతి ఏటా శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పుష్కరిణికి మ-రమ్మతులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా ఆగస్టు 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు నెల రోజుల పాటు పుష్కరిణి మరమ్మతు పనులను చేపట్టాలని టీటీడీ నిర్ణయించింది. ఈ ఏడాది సెప్టెంబరు 15వ తేదీ నుంచి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల నాటికి పుష్కరిణిని సర్వాంగ సుందరంగా, పవిత్రంగా తీర్చిదిద్దేందుకు ..మిగతా 2లో

# జోగిపై గృహహింస కేసు

## 11 మంది కుటుంబ సభ్యులపై ఎఫ్ ఐ ఆర్

## జోగి రాము భార్య ఫిర్యాదు మేరకు నమోదు

## అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని అభియోగం



2

## కేంద్ర మంత్రి రవ్‌నీతిసింగ్ బిట్టు

# రాజీనామా

## రాజ్యసభ సభ్యత్వం ముగియడంతోనే

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



పంజాబ్ బీజేపీ సీనియర్ నేత, కేంద్ర రైల్వే శాఖ, ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఇటీవల ఆయన రాజ్యసభ సభ్యత్వం కూడా ముగియడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది జరగనున్న పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించేందుకే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రవ్‌నీత్ సింగ్ బిట్టు రాజ్యసభ సభ్యుడిగా ఉన్న పదవీకాలం జూన్‌లో ముగిసింది. రాజ్యసభ ..మిగతా 2లో

For a pure tomorrow..
జయహో

# గిరిప్రదక్షిణకు ఏఐ

**(విశాఖపట్నం - జయజయహే)**

జూలై 28, 29 తేదీలలో జరగనున్న సింహాచలం గిరి ప్రదక్షిణకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారిని నియంత్రించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత జన సమూహ పర్యవేక్షణ, సీసీటీవీ నిఘాను ఏర్పాటు చేయనున్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాట్లను సమీక్షించిన విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. అభిషక్త కిషోర్.. ట్రాఫిక్ నిర్వహణ, భద్రత, తాగునీరు, వైద్య సేవలు, పారిశుధ్యం, విద్యుత్, రవాణా కోసం సమన్వయ ఏర్పాట్లు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. 32 కిలోమీటర్ల ఈ ప్రదక్షిణకు ఐదు నుంచి ఆరు లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా. ఈ మార్గాన్ని ఏడు జోన్లుగా, 28 సెక్షన్లుగా విభజించి, పోలీసు, జీవీఎంసీ అధికారులను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. జూలై 27 నుండి జూలై 29 ఉదయం వరకు ఆరు షిఫ్టులలో విధులు నిర్వహిస్తారు. ఒక సెంట్రల్ కమాండ్, కంట్రోల్ రూమ్, అలాగే తొలిపవంచ, అడవివరం జంక్షన్, హనుమంతువాక, అప్పుఘర్, మాధవధార, ఎన్ఎస్‌టిఎల్ గేట్, గోపాలపట్నంలోని ఏడు కంట్రోల్ సెంటర్ల సహకారంతో జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు ప్రతి జోన్‌ను పర్యవేక్షిస్తారు. 28 సహాయ కేంద్రాలు తాగునీటిని అందిస్తాయి. అదే సమయంలో మార్గం పొడవునా వాలంటీర్లు, వైద్య సిబ్బంది, భద్రతా సిబ్బందిని మోహరిస్తారు. అధికారులు అప్పుఘర్ వద్ద 31 వైద్య శిబిరాలను, 595 తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపు గదులను ఏర్పాటు చేస్తారు. మార్గం పొడవునా ఏర్పాటు చేసిన 70 తాత్కాలిక



సీసీటీవీ కెమెరాలతో ఏఐ ఆధారిత జన సమూహ పర్యవేక్షణ వ్యవస్థను అనుసంధానిస్తారు. వీటి ప్రత్యక్ష ప్రసారాలను అన్ని కంట్రోల్ రూమ్‌లలోని డాష్‌బోర్డ్‌లకు అనుసంధానిస్తారు. ఒకవేళ భక్తులు దారి తప్పితే వారిని గుర్తించడంలో సహాయపడటానికి, వారికి ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌లను జారీ చేస్తారు. గుర్తించిన 58 ప్రదేశాలలోని పార్కింగ్ సౌకర్యాలలో సీసీటీవీ కెమెరాలు, లైటింగ్, సైన్‌బోర్డులను ఏర్పాటు చేస్తారు.

బీఆర్ టీ ఎస్ రహదారిపై వాహనాల రాకపోకలను నియంత్రిస్తారు. ప్రత్యామ్నాయ ట్రాఫిక్ మార్గాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. దాతలు ఏర్పాటు చేసే ఆహార స్టాళ్లకు అధికారిక అనుమతి అవసరం, అవి ప్రధాన రహదారులకు అడ్డంకిగా ఉండకూడదు. అధికారులు విద్యుత్ సరఫరా పాయింట్లను, అగ్నిమాపక వాహనాల స్థానాలను కూడా ముందుగానే గుర్తిస్తారు. ఈ కార్యక్రమం జరిగే సమయంలో మద్యం దుకాణాలు మూసివేస్తారు. ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక టెర్మినళ్లు, తాత్కాలిక స్టాపులతో ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతుంది. అదే సమయంలో జూలై 29న 50 దేవాలయ బస్సులు ఉచిత రవాణాను అందిస్తాయి. తొలిపవంచ వద్ద రద్దీని తగ్గించడానికి, కొత్త టోల్ గేట్‌తో సహా పలు ప్రదేశాలలో ప్రతిరూప దేవాలయాలను ఏర్పాటు చేస్తారు.

సులభమైన రాకపోకల కోసం ట్రాఫిక్ మళ్లింపులు, భారీ వాహనాలపై ఆంక్షలు, ప్రత్యామ్నాయ మార్గాలను ప్రణాళిక చేశామని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. తాత్కాలిక, ఇప్పటికే ఉన్న సీసీటీవీ కెమెరాల ద్వారా ఏఐ-ఆధారిత నిఘా పోలీసుల మోహరింపునకు సహాయపడుతుంది. అదే సమయంలో ప్రత్యేక అత్యవసర కారిడార్లను నిర్వహిస్తారు. సముద్ర స్నానాలు చేసే భక్తుల భద్రత కోసం అప్పుఘర్, జోడుగుళ్లపాలెంలో తొంభై మంది నిపుణులైన ఈతగాళ్లను నియమిస్తారు. శ్రీకాకుళం, విజయనగరం నుంచి వచ్చే భారీ వాహనాల కోసం ట్రాఫిక్ మళ్లింపులను జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి వివరించగా, ఈ కార్యక్రమం సందర్భంగా హనుమంతువాక నుంచి మద్దిలపాలెం వరకు, బీచ్ రోడ్డు వెంబడి "నో వెహికల్ జోన్‌లను" అమలు చేస్తామని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు

## నిరసనల హోరులో
# వందేమాతరం

**మొదటి పేజీ తరువాయి...**

జాతీయ పతాకం, రాజ్యాంగం, జాతీయ గీతాన్ని (జనగణమన) అవమానించడం నేరం. ఈ నేరానికి గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించే నిబంధన ఉంది. సవరణ బిల్లు ప్రకారం, ఇకపై జాతీయ గేయం 'వందేమాతరం' అలాపనకు ఆటంకం కలిగించినా లేదా దానికి అవమానం కలిగించినా కూడా నేరంగా పరిగణించబడుతుంది. దీనికి కూడా గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది.

**విపక్షాల తీవ్ర అభ్యంతరం**

ఈ బిల్లు ప్రవేశపెట్టడాన్ని కమ్యూనిస్ట్ పార్టీలకు చెందిన ఎంపీలతో పాటు 'ఇండియా' కూటమి ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకించారు. సీపీఐ ఎంపీ పి. సందోష్ కుమార్, సీపీఐ(ఎమ్) ఎంపీ జాన్ బ్రిట్టాస్ బిల్లుకు వ్యతిరేకంగా మాట్లాడారు. తాము వందేమాతరాన్ని గౌరవిస్తామని, అయితే ఈ బిల్లు రవీంద్రనాథ్ ఠాగూర్, బంకిం చంద్ర ఛటోపాధ్యాయల మధ్య విభజన తెచ్చేలా ఉందంటూ సందోష్ కుమార్ ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ ఆందోళనల నుంచి, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే ప్రభుత్వం "దేశభక్తిని సృష్టించే" ప్రయత్నం చేస్తోందని విపక్ష నాయకులు ఆరోపించారు. మరోవైపు లోక్‌సభలోనూ నీట్ యూజీ 2026 అక్రమాలపై విపక్షాలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టాయి. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ, నీట్ అంశంపై సమగ్ర చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, షరతులు విధించవద్దని విపక్షాలను కోరారు. పేపర్ లీకేజీలపై కఠిన చట్టం తేనున్నట్లు ప్రధాని మోదీ ఇదివరకే హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయినప్పటికీ విపక్షాల నిరసనలు తగ్గకపోవడంతో లోక్‌సభ కూడా సోమవారానికి వాయిదా పడింది.

# సైలెన్స్ పాలిటిక్స్..!

**మొదటి పేజీ తరువాయి...**




విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత సున్నితమైన అంశంపై ఈ రెండు పార్టీల మౌనం రాజకీయంగా పలు అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా ప్రతిపక్షాలకు యువత, విద్యార్థి వర్గాల మద్దతును పొందేందుకు ఇలాంటి జాతీయ స్థాయి వివాదాలు ఒక పెద్ద ఆయుధంగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా బీజేపీ వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రాంతీయ పార్టీలు ముందంజలో ఉండాలి. కానీ, తెలంగాణలో బీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ రెండూ కూడా జాతీయ స్థాయిలో విపక్షాల కూటమి పిలుపునిచ్చిన నిరసనలకు భౌతికంగా, ఉధృతంగా మద్దతు తెలపకపోవడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహంతో పాటు కేంద్రం పట్ల ఉన్న భయాందోళనలే కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందిగ్ధ పరిస్థితికి ప్రధాన కారణం కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ నాయకత్వం పట్ల ఈ పార్టీలకున్న వినూత్నమైన అభద్రత. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ గత లోక్‌సభ ఎన్నికల తర్వాత, అసెంబ్లీ ఓటమి అనంతరం తన రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు బీజేపీతో అనధికారికంగా ఒక వ్యూహాత్మక శాంతి ని పాటిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. కేంద్రాన్ని లేదా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులను నేరుగా టార్గెట్ చేస్తే టీఎంసీ లాంటి పరిస్థితులు రావొచ్చని సందేహిస్తున్నారు.

**వైసీపీ కూడా అంతే !**

అటు ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలో ఉంది. గత ఐదేళ్ల పాలనపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం పలు విచారణలకు ఆదేశిస్తున్న తరుణంలో, కేంద్రంలోని బీజేపీ పెద్దల ఆగ్రహానికి గురైతే పార్టీ మరింత తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ భావిస్తోంది. అందువల్లనే, కేంద్ర విద్యాశాఖ , మోదీ ప్రభుత్వాన్ని విమర్శించే విషయంలో వైఎస్సార్‌సీపీ చాలా అప్రమత్తంగా, పరిమిత వ్యాఖ్యలకే పరిమితమవుతూ, వీధుల్లోకి వచ్చి పోరాడేందుకు వెనుకాడుతోంది. విద్యార్థుల భవిష్యత్తు ఎటుపోయినా పర్వాలేదు కానీ, కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు మాత్రం కేంద్రాన్ని ప్రశ్నించరు అంటూ రేవంత్ రెడ్డి టార్గెట్ చేస్తుండటంతో, బీఆర్ఎస్ డిఫెన్స్‌లో పడిపోతోంది. తమ స్వయంకృత అపరాధాల వల్ల వచ్చిన కేసుల భయంతోనే బీఆర్ఎస్ నోరు మెదపడం లేదని కాంగ్రెస్ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. అందుకే మొక్కుబడిగా జంతర్, మంతర్ దగ్గర బీఆర్ఎస్వీతో నిరసనలు చేయిస్తామని ప్రకటించారు.

**రాజకీయంలో నష్టమే**

సుదీర్ఘ కాలంలో ఈ తరహా మౌనం ప్రాంతీయ పార్టీలకు పెద్ద దెబ్బగా మారే అవకాశం ఉంది. రాబోయే కాలంలో నిరుద్యోగిత, విద్యార్థుల సమస్యలు, రిక్రూట్‌మెంట్లు ప్రధాన రాజకీయ అంశాలుగా మారబోతున్న తరుణంలో, యువతకు అండగా నిలవాల్సిన ప్రతిపక్షాలు వెనుకడుగు వేస్తున్నాయి. ఇది కాంగ్రెస్‌కు విద్యార్థి, యువజన ఓటు బ్యాంకును మరింత బదిలీ చేసేందుకు దోహదపడుతోంది. కేంద్రంలోని బీజేపీ అగ్రనాయకత్వం పట్ల ఉన్న భయం, రాజకీయంగా వ్యూహాత్మకంగా సైలెంట్‌గా ఉండాలనే నిర్ణయం వల్లనే బీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీలు జాతీయ స్థాయి ఆందోళనలకు దూరంగా ఉంటున్నాయి. ఈ వ్యూహం ప్రస్తుతానికి తమపై కేంద్ర సంస్థల దాడులు పడకుండా కాపాడుకోవడానికి ఉపయోగపడవచ్చు ఏమో కానీ, క్షేత్రస్థాయిలో విద్యార్థులను, యువత మద్దతు కోల్పోయే ప్రమాదాన్ని ఈ ప్రాంతీయ పార్టీలు స్వయంగా తెచ్చిపెట్టుకుంటున్నాయని ఎక్కువ మంది భావిస్తున్నారు.



# అతిపెద్ద ధింసాతో ప్రధానికి ఘనస్వాగతం

**మొదటి పేజీ తరువాయి...**

భోజన సదుపాయం కల్పించాలి. ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ ఏర్పాట్ల కమిటీ ముఖ్య అధికారి ఎంటి కృష్ణబాబు మాట్లాడుతూ... ప్రధాని బహిరంగసభను వీక్షించేందుకు ప్రతి 5వేలమందికి ఒక ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నాం, సీనియర్ ఐఎఎస్ అధికారులు, జాయింట్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. సమీక్షా సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి కిలారి రాజేష్, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, ఎంపి చింతకాయల విజయ్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, కార్యక్రమాల కమిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణరాజు, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు (విజయనగరం), కళా వెంకట్రావు (చీపురుపల్లి), కోండ్రు మురళీమోహన్ (రాజాం), లోకం నాగమాధవి (నెల్లిమర్ల), విఎంఆర్ డిఎ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, ఆర్ అండ్ బి ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణబాబు, వైద్య,ఆరోగ్యశాఖ కార్యదర్శి జి.వీరపాండ్యన్, విజయనగరం కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, పౌర సరఫరాల సంస్థ ఎండి ఢిల్లీరావు, మార్క్ ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఛైర్మన్ ఎంఎం నాయక్, ఎపి గిరిజన కార్పొరేషన్ ఎండి ఎస్ఎస్ శోభిక, విశాఖపట్నం రేంజి ఐజి గోపినాథ్ జెట్టి, రవాణాశాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా, విజయనగరం ఎస్పీ దామోదర్, ఎపి ట్రైబల్ వెల్ఫేర్ డైరక్టర్ భార్గవి,ప్రోటోకాల్ (జిఎడి) డైరక్టర్ మోహన్ రావు, విజయనగరం జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్, విజయనగరం డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



భోగాపురం (విజయనగరం జిల్లా): ఉత్తరాంధ్రకే తలమానికంగా రూపుదిద్దుకున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం (భోగాపురం)ను ఆగస్టు 1వతేదీన ప్రధాని నరేంద్ర మోదీజీ జాతికి అంకితం చేస్తున్న నేపథ్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నభూతో నభవిష్యత్ అనే రీతిలో విజయవంతం చేయాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం పరిశీలించిన మంత్రి లోకేష్, అనంతరం సమీక్ష నిర్వహించారు. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి 3లక్షలమంది ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం, ప్రధాని మోదీజీ బహిరంగసభకు హాజరవుతారని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. కూటమి నాయకులు సమన్వయంతో పనిచేసి ప్రధాని సభను విజయవంతం చేయాలని కోరారు.

ప్రధాని మోదీజీకి ఘన స్వాగతం పలుకుతూ సుమారు 13వేలమందితో దేశంలోనే అతిపెద్ద ధింసా నృత్య ప్రదర్శనకు ఏర్పాట్లు చేయాలి. ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ సభకు హాజరయ్యే ప్రజలకోసం 36 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 5వేల బస్సులు రానున్నాయి. సభకు వచ్చేవారు బస్సు ఎక్కినప్పటినుంచి తిరిగి వెళ్లేవరకు ఎటువంటి లోటులేకుండా మండలస్థాయి లైజన్ ఆఫీసర్లు దగ్గరుండి చూసుకోవాలి. సభకు హాజరయ్యే వారందరికీ తాగునీరు, అల్పాహారం, భోజన సదుపాయం కల్పించాలి. ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ ఏర్పాట్ల కమిటీ ముఖ్య అధికారి ఎంటి కృష్ణబాబు మాట్లాడుతూ... ప్రధాని బహిరంగసభను వీక్షించేందుకు ప్రతి 5వేలమందికి ఒక ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నాం, సీనియర్ ఐఎఎస్ అధికారులు, జాయింట్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

సమీక్షా సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి కిలారి రాజేష్, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, ఎంపిలు కలిశెట్టి అప్పలనాయుడు, చింతకాయల విజయ్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, కార్యక్రమాల కమిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణరాజు, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు (విజయనగరం), కళా వెంకట్రావు (చీపురుపల్లి), కోండ్రు మురళీమోహన్ (రాజాం), లోకం నాగమాధవి (నెల్లిమర్ల), విఎంఆర్ డిఎ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, ఆర్ అండ్ బి ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణబాబు, వైద్య,ఆరోగ్యశాఖ కార్యదర్శి జి.వీరపాండ్యన్, విజయనగరం కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, పౌర సరఫరాల సంస్థ ఎండి ఢిల్లీరావు, మార్క్ ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఛైర్మన్ ఎంఎం నాయక్, ఎపి గిరిజన కార్పొరేషన్ ఎండి ఎస్ఎస్ శోభిక, విశాఖపట్నం రేంజి ఐజి గోపినాథ్ జెట్టి, రవాణాశాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా, విజయనగరం ఎస్పీ దామోదర్, ఎపి ట్రైబల్ వెల్ఫేర్ డైరక్టర్ భార్గవి,ప్రోటోకాల్ (జిఎడి) డైరక్టర్ మోహన్ రావు, విజయనగరం జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్, విజయనగరం డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌స్టాలో మోదీ క్రేజ్

**మొదటి పేజీ తరువాయి...**

అర్ధరాత్రి ప్రధాని మోదీ నీట్ ఎగ్జామ్ పేపర్ లీక్‌పై కీలక ప్రకటన చేశారు. పేపర్ లీక్ ఘటనలు చిన్న విషయాలు కావని, అవి లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే అత్యంత తీవ్రమైన అంశాలని అందులో మోదీ తెలిపారు. ఇప్పటికే నిందితులను అరెస్ట్ చేసి కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ వీడియో అప్‌లోడ్ చేయకముందు ప్రధాని మోదీ ఫాలోవర్స్ 101 మిలియన్స్ ఉన్నారు. ఈ వీడియో అప్‌లోడ్ తర్వాత ఆ సంఖ్య 102 మిలియన్స్‌కు చేరడం గమనార్హం. ప్రధాని మోదీకి ఉన్న అంతర్జాతీయ క్రేజ్, దేశీయంగా ఆయనకున్న ప్రజాదరణ ఏ స్థాయిలో ఉందో ఈ ఫాలోవర్ల పెరుగుదల స్పష్టం చేస్తోంది. గడిచిన కొద్ది గంటల్లోనే ఇంత పెద్ద మొత్తంలో ఫాలోవర్లు పెరగడంపై పలువురు డిజిటల్ విశ్లేషకులు, నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ పోస్ట్‌లు చేస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇప్పటికే ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రపంచంలోనే అత్యధికంగా ఫాలో అవుతున్న అధికారంలో ఉన్న ఏకైక ప్రపంచ నేతగా రికార్డు సృష్టించారు. మోదీ ఇప్పటికే 100 మిలియన్లకు పైగా ఫాలోవర్ల అరుదైన మైలురాయిని దాటి సరికొత్త చరిత్ర సృష్టించారు. అమెరికా మాజీ లేదా ప్రస్తుత అధ్యక్షులు, యూకే ప్రధానులు, ఇతర గ్లోబల్ లీడర్ల కంటే ప్రధాని మోదీ ఫాలోవర్ల సంఖ్య చాలా రెట్లు ఎక్కువగా ఉంది.

## కేంద్ర మంత్రి రవ్‌నీతిసింగ్ బిట్టు
# రాజీనామా

**మొదటి పేజీ తరువాయి...**

సభ్యత్వం లేకపోవడంతో ఆయన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం. వచ్చే ఏడాది జరగనున్న పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి బలమైన నాయకుడిగా బిట్టును ముందుకు తీసుకురావాలని పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధికారంలో ఉన్న పంజాబ్‌లో పార్టీ బలోపేతంపై ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని సమాచారం. ముఖ్యంగా హిందువులు, సిక్కులు, దళితులు, ఇతర వెనుకబడిన వర్గాల (ఓబీసీ) ఓటర్లను ఆకర్షించే వ్యూహంపై ఆయన పనిచేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బీంత్ సింగ్ మనవడైన రవ్‌నీత్ సింగ్ బిట్టు గతంలో కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉన్నారు. 2024లో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి భారతీయ జనతా పార్టీలో చేరారు. అనంతరం లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసినప్పటికీ విజయం సాధించలేకపోయారు. తర్వాత కాంగ్రెస్ నాయకుడు కేసీ వేణుగోపాల్ ఖాళీ చేసిన రాజస్థాన్ రాజ్యసభ స్థానానికి నామినేట్ కావడంతో కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కింది. ఇటీవల పంజాబ్‌కు సంబంధించిన పలు సున్నిత అంశాలపై బిట్టు తన అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేశారు. ముఖ్యంగా నటుడు దిల్జిత్ దోసాంజ్ నటించిన 'సట్లజ్' చిత్రాన్ని విమర్శిస్తూ, అది సమాజంలో ఉద్రిక్తతలు పెంచే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు కూడా పంజాబ్ రాజకీయాల్లో చర్చనీయాంశమయ్యాయి. రాష్ట్ర జనాభాలో సిక్కులు సుమారు 58 శాతం, హిందువులు 39 శాతం ఉండగా, దళితులు దాదాపు 32 శాతం, ఓబీసీలు సుమారు 16 శాతం ఉన్నట్లు అంచనాలు ఉన్నాయి. ఈ ప్రధాన సామాజిక వర్గాలన్నింటినీ ఆకర్షించే వ్యూహంతో బీజేపీ ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# జోగిపై గృహహింస కేసు

**11 మంది కుటుంబ సభ్యులపై ఎఫ్ ఐ ఆర్**

**జోగి రాము భార్య ఫిర్యాదు మేరకు నమోదు**

**అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని అభియోగం**

**(ఎన్టీఆర్ జిల్లా - జయజయహే)**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబంలో తీవ్ర కలకలం రేగింది. జోగి రమేష్‌తో పాటు ఆయన సోదరుడు జోగి రాము కుటుంబానికి చెందిన మొత్తం 11 మంది సభ్యులపై గృహహింస, వరకట్న వేధింపుల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఆంధ్రప్రదేశ్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జోగి రాము భార్య ఇచ్చిన సంచలన ఫిర్యాదుతో పోలీసులు ఈ చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. తనను పెళ్లి చేసుకున్నప్పటి నుంచి అదనపు కట్నం కోసం తీవ్ర మానసిక, భౌతిక వేధింపులకు గురిచేస్తున్నారని ఆమె పోలీసులను ఆశ్రయించారు. ఈ గృహహింస వేధింపులకు కుటుంబ పెద్దగా ఉన్న మాజీ మంత్రి జోగి రమేష్ , ఆయన భార్య ప్రోత్సాహం ఉందంటూ, వారిద్దరితో పాటు కుటుంబానికి చెందిన 11 మంది సభ్యుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు గృహహింస నిరోధక చట్టం తో పాటు వరకట్న వేధింపులు, తీవ్రస్థాయి బెదిరింపులకు సంబంధించిన కఠినమైన చట్టపరమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బాధితురాలి నుంచి ఇప్పటికే విచారణాధికారులు ప్రాథమిక వాంగ్మూలాన్ని సేకరించారు. ఫిర్యాదులో లేవనెత్తిన ఆరోపణలకు తగిన ఆధారాలను సిద్ధం చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. కేసు నమోదు చేసుకున్న ఎన్టీఆర్ జిల్లా పోలీసులు తదుపరి చర్యలను వేగవంతం చేశారు. కేసులో నిందితులుగా ఉన్న జోగి రమేష్, జోగి రాములతో సహా 11 మందికి త్వరలోనే సీఆర్పీసీ నిబంధనల ప్రకారం విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. గత కొంతకాలంగా వివిధ రాజకీయ, చట్టపరమైన వివాదాలు ఎదుర్కొంటున్న జోగి కుటుంబానికి ఈ సొంత ఇంట తలెత్తిన గృహహింస కేసు చట్టపరంగా మరో భారీ సవాలుగా పరిణమించింది.

# శ్రీవారి పుష్కరిణి మూసివేత

**మొదటి పేజీ తరువాయి...**

టీటీడీ వాటర్ వర్క్స్ విభాగం ఆధ్వర్యంలో పనులను శరవేగంగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పుష్కరిణిలోని నీటిని పూర్తిగా ఖాళీ చేసి, అడుగున ఉన్న పూడికను తొలగించి... పైపింగ్ వ్యవస్థను పునరుద్ధరించనున్నారు.

**40 రోజులు పుష్కరిణి మూసివేత...**

సాధారణంగా ఆగస్టు ఆఖరు నాటికి మరమ్మతులు పూర్తయినప్పటికీ, వర్షాకాలం దృష్ట్యా టీటీడీ అదనపు జాగ్రత్తలు తీసుకుంటోంది. భారీ వర్షాలు, తుఫాన్లు, ఇతర వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ముందస్తు జాగ్రత్త చర్యగా సెప్టెంబర్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు కూడా పుష్కరిణిని మూసివేయనున్నారు. ఈ నిర్ణయంతో ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 10 వరకు.... అంటే మొత్తం 40 రోజుల పాటు పుష్కరిణి హారతి కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తారు. అదేవిధంగా ఈ 40 రోజుల వ్యవధిలో భక్తులెవరినీ పుష్కరిణిలోకి దిగడానికి గానీ, స్నానాలు చేయడానికి గానీ అనుమతించరు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు ఈ మార్పును గమనించి, టీటీడీ యాజమాన్యానికి సంపూర్ణంగా సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# జెస్సీ విజయం మా పాఠశాలకే కాదు... దేశానికే గర్వకారణం'









**స్టాఫ్ రిపోర్టర్ పళ్ళా సత్యనారాయణ**
**రాజమహేంద్రవరం**

### ప్రతిభకు పేదరికం అడ్డుకాదు.. ప్రపంచ వేదికపై తెలుగు తేజం!

### ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆనందం.. జెస్సీ విజయంలో కృషి, క్రమశిక్షణే మూలం

**రాజమహేంద్రవరం, జూలై 24, జయ జయహే :**

ప్రపంచంలోనే తొలి ఆల్-గర్ల్స్ లూనర్ మిషన్ --శక్తిషాట'కు ధవళేశ్వరం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని కందుల జెస్సీ ఎంపిక కావడం రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన కఠిన ఎంపికలో ఒక్క విద్యార్థినిగా ఎంపికై ప్రపంచ వేదికపై తెలుగు ప్రతిభను చాటిన జెస్సీ విజయంపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు."జెస్సీ మా పాఠశాల గర్వం.. భవిష్యత్ అంతరిక్ష శాస్త్రవేత్త అవుతుంది" -- ప్రిన్సిపాల్ తమ్మిశెట్టి పద్మజ జ్యోత్స్న పాఠశాల ప్రిన్సిపాల్ తమ్మిశెట్టి పద్మజ జ్యోత్స్న మాట్లాడుతూ, వేలాది మంది విద్యార్థినుల మధ్య జెస్సీ ఎంపిక కావడం ఆమె అసాధారణ ప్రతిభకు నిదర్శనమన్నారు. పదో తరగతి చదువుతో పాటు శక్తిషాట్ శిక్షణను సమన్వయం చేసుకునేలా ప్రత్యేక విద్యా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. శిక్షణ పూర్తైన తర్వాత పదో తరగతి పరీక్షల్లో కూడా అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు పూర్తి సహకారం అందిస్తారని చెప్పారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు జెస్సీ విజయం గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని, భవిష్యత్తులో కల్పనా చావ్లా తరహాలో అంతరిక్ష రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. జెస్సీకి ఎనిమిదో తరగతి నుంచే బోధిస్తున్న ఫిజిక్స్ టీచర్ ఎం. మణిమాల మాట్లాడుతూ, జెస్సీ సాధారణ విద్యార్థిని కాదని, ప్రతి అంశాన్ని లోతుగా తెలుసుకోవాలనే ఆసక్తి ఆమె ప్రత్యేకత అన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో చురుకుగా పాల్గొంటూ కొత్త ప్రాజెక్టులు రూపొందించేదని, స్పేస్ ఎడ్యుకేషన్‌లో 21 సర్టిఫికెట్లు సాధించి తన ప్రతిభను నిరూపించిందన్నారు. పుస్తకాలతో పాటు యూట్యూబ్, డిజిటల్ వనరులు, కృత్రిమ మేధ సహాయంతో కూడా నిరంతరం అధ్యయనం చేసేదని చెప్పారు. ఇంగ్లీష్ మాట్లాడటంలోనూ ప్రత్యేకంగా సాధన చేసి ఇంటర్వ్యూలో ఆత్మవిశ్వాసంతో సమాధానాలు చెప్పి ఎంపిక సాధించిందన్నారు. "ఇది కష్టం" అనే మాట ఆమె నోట ఎప్పుడూ వినలేదని, ఓర్పు, క్రమశిక్షణ, పట్టుదలే జెస్సీ విజయ రహస్యమని కొనియాడారు. విద్యార్థిని కందుల జెస్సీ మాట్లాడుతూ ప్రపంచ తొలి ఆల్-గర్ల్స్ లూనర్ మిషన్‌కు ఎంపిక కావడం జీవితంలో మరపురాని ఘట్టమని జెస్సీ తెలిపింది. ఎంపికపై నమ్మకం ఉన్నా రాష్ట్రం మొత్తం నుంచి ఒక్కరినే ఎంపిక చేస్తారని ఊహించలేదని పేర్కొంది. ఈ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా వచ్చిన విద్యార్థులు, అధికారులు, శాస్త్రవేత్తలతో కలిసే అవకాశం దక్కిందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రపతిని ప్రత్యక్షంగా కలవడం జీవితాంతం గుర్తుండిపోయే అనుభవమని చెప్పింది. వేసవి సెలవుల్లో ప్రతిరోజూ ఐదు గంటల పాటు చదివి, క్లిష్టమైన అంశాలను పలుమార్లు అధ్యయనం చేసి, నోట్స్ తయారు చేసుకుంటూ సిద్ధమయ్యానని తెలిపింది. తన విజయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, క్రమశిక్షణ, నిరంతర శ్రమే కారణమని పేర్కొంది. "కష్టపడితే అవకాశాలు మనల్ని వెతుక్కుంటూ వస్తాయి" అని విద్యార్థులకు సందేశమిచ్చింది. జెస్సీ తండ్రి కందుల శ్రీను మాట్లాడుతూ, తాను వడ్రంగి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నానని చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినా, అదే పాఠశాల తన కుమార్తెను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిందన్నారు. జెస్సీ చిన్నప్పటి నుంచే చదువులో ప్రతిభ కనబరిచేదని, ఆమె విజయం వెనుక ఉపాధ్యాయుల అంకితభావం, పాఠశాల సహకారం ఎంతో ఉందన్నారు.

**జయ జయహే ప్రత్యేక కథనం**

# బడి వెలుపల ఒక్క అడుగు కార్యక్రమంలో పాల్గొన్న కొణతాల

**అనకాపల్లి జయ జయహే**



బడి వెలుపల ఉన్న పిల్లలను గుర్తించి వారికి నాణ్యమైన విద్యను అందించాలని లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో బడి వెలుపల ఒక్క అడుగు తల్లిదండ్రులతో ముచ్చట్ల కార్యక్రమం గవర్నమెంట్ ఉన్నత పాఠశాల స్థానిక గాంధీ నగరం ప్రాంగణంలో తల్లిదండ్రులతో ప్రభుత్వ విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సమావేశం 4.0 సందర్భంగా స్థానిక శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాయణ లోకేష్ నేతృత్వంలో సమూల మార్పులు తీసుకొచ్చి క్రమశిక్షణతో కూడిన విద్యార్థులను మరియు బాధ్యతాయుతమైన భారత పౌరులను తీర్చిదిద్దేందుకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు విద్యార్థుల కోసం నూతన సిలబస్ నాణ్యమైన పాఠ్య పుస్తకాలు బ్యాగులు తో పాటు తల్లికి వందనం ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మంది పిల్లలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు ప్రభుత్వ పాఠశాల విద్య నాణ్యతను పెంపొందించేందుకు గత ఏడాది రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా 16,300 మంది కొత్త ఉపాధ్యాయులు నియమించామని ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు తల్లిదండ్రులకు విశ్వాసం పెరిగి ప్రైవేటు పాఠశాలల నుంచి కూడా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్నారని ఇది ఎంతో సంతోషదాయకమని విద్యార్థుల ప్రతిభ మెరుగుపరిచేందుకు టెస్టుల వంటి పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని రాబోయే విద్యాసంస్థల 100% ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు ముఖ్యంగా విద్యార్థులు మొబైల్ ఫోన్లు సోషల్ మీడియా కి దూరంగా ఉండాలని తల్లిదండ్రులు పిల్లల చదువులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు అలాగే ఉపాధ్యాయులకు గురువులకు గౌరవం ఇవ్వడం వారి సూచనలు పాటించడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తు మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి పట్టణ సీఐ అశోక్ కుమార్ ఎంఈఓ మరియు విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కూటమి నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.




## ప్రభుత్వ పాఠశాలల్లో 100% ఫలితాలే లక్ష్యం:

### ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ


**నాయుడుపేట,జూలై 24,జయ జయహే:**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పిలుపునిచ్చారు.నాయుడుపేట జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన "మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్"లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా "మిషన్ మార్చి-2027" ద్వారా పదో తరగతి ఫలితాల్లో 100% ఉత్తీర్ణత సాధించాలని,కూటమి ప్రభుత్వం అందిస్తున్న 'తల్లికి వందనం', 'సర్వేపల్లి విద్యార్థి మిత్ర',పోషకాహారం వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన ఎమ్మెల్యే,భోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలపై ఆప్యాయంగా ముచ్చటించారు.ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ,ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్,ప్రధాన కార్యదర్శి అవధానం సుధీర్,పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు,కూటమి నాయకులు,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శివాలయానికి రుద్రాక్ష మాలలు వితరణ

**శ్రీకాళహస్తి, జులై 24,జయ జయహే**

.శ్రీ కాళహస్తీశ్వర ఆలయానికి శుక్రవారం రుద్రాక్ష మాలలను దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల సలహా మండలి మాజీ సభ్యుడు అయిత మురళీకృష్ణ విరాళంగా అందజేశారు. ఆలయంలోని 63 మంది నయనార్లకు, పాండవులు, ద్రౌపది దేవి, శ్రీకృష్ణుడు విగ్రహాలకు, నయనార్ల వద్ద ఉన్న శివ లింగాలకు అలంకరించడానికి రుద్రాక్ష మాలలు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో దేవస్థానం ఇఓ వెంకటేశ్వర్లు, సూపరిండెంట్ నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరిబాబు యాదవ్, శ్యానిటరీ ఇన్స్పెక్టర్ విజయ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.





## 62 ఏళ్లకు విద్యుత్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంచాలి

### సీఎండీ పృథ్వీతేజ్‌ను కోరిన ఏపీ పవర్ ఎంప్లాయీస్ ఫోరం

**విశాఖపట్నం, జులై 24, జయ జయహే :**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే విద్యుత్ రంగంలోని అన్ని డిస్కంల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచుతూ తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం (టి.ఎన్.వి.కె.ఎస్.) రాష్ట్ర అధ్యక్షులు పర్వతనేని సాంబశివరావు, ఏపీ పవర్ ఎంప్లాయీస్ ఫోరం అధ్యక్షులు జి. రామకృష్ణుడు, ప్రధాన కార్యదర్శి ఎస్. కోటేశ్వరరావు నాయకత్వంలోని ప్రతినిధి బృందం ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్‌ను కోరారు. ఈ మేరకు స్వయంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరుగురు సభ్యుల కమిటీలో సీఎండీ సభ్యుడిగా ఉన్న నేపథ్యంలో, విద్యుత్ సంస్థల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన సానుకూల నిర్ణయం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫోరం నాయకులు మాట్లాడుతూ, పదవీ విరమణ వయస్సు పెంపు వల్ల సంస్థలపై అదనపు ఆర్థిక భారం చాలా స్వల్పంగానే ఉంటుందని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ఏర్పడే ఖాళీలను ప్రమోషన్లు, దిగువ కేడర్ నియామకాల ద్వారా భర్తీ చేయాల్సి ఉండటంతో సంస్థలకు అదనపు వ్యయం పెద్దగా ఉండదని వివరించారు. ఈ నిర్ణయం వల్ల విద్యుత్ టారిఫ్‌పై లేదా వినియోగదారులపై ఎలాంటి అదనపు భారం పడదని స్పష్టం చేశారు. పదవీ విరమణ పొందే ఉద్యోగుల్లో ఎక్కువ మంది పర్యవేక్షణ స్థాయి అధికారులు కావడంతో, క్షేత్రస్థాయి పనుల నిర్వహణపై ఎలాంటి ప్రభావం ఉండదని పేర్కొన్నారు. ఇప్పటికే పలు ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో 62 సంవత్సరాల పదవీ విరమణ విధానం విజయవంతంగా అమలవుతోందని గుర్తుచేశారు. 58 నుండి 60 సంవత్సరాలకు పదవీ విరమణ వయస్సు పెంపు అమలులో అనుసరించిన విధానాన్నే ప్రస్తుతం కూడా అమలు చేయాలని, బి.పి.ఎం.ఎస్. నెం.36, 37 కింద నియమితులై పూర్తి పెన్షన్‌కు అర్హత పొందని ఉద్యోగులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ (హెచఆర్‌డీ) రవికుమార్, రత్నాకర్, నాగేశ్వరరావు, ఏపీ పవర్ ఎంప్లాయీస్ ఫోరం ప్రతినిధులు, వివిధ విద్యుత్ సంస్థల రిటైర్డ్ అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



### చలో విజయవాడ

## జయప్రదం చేయండి

**అనకాపల్లి జయ జయహే**

ఆర్టీసీ అవుట్సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి అంటూ ఈనెల 27న చలో విజయవాడ మహా ధర్నా విజయవంతం చేయాలని ఏఐటియుసి రాష్ట్ర సమితి కోణా లక్ష్మణ్ పిలుపునిచ్చారు శుక్రవారం స్థానిక ఆర్టిసి కాంప్లెక్స్ ఆవరణ లో ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ అనకాపల్లి సమితి సమావేశం నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా కోణాలక్షణ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖలు ప్రభుత్వ రంగ సంస్థల పని చేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని అమలు చేసి అవుట్సోర్సింగ్ కార్మికుల శాశ్వత ఉద్యోగులతో సమాన హక్కులు సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు ఆర్టీసీలో అనేక సంవత్సరాలు గా సేవలందిస్తున్న కార్మికులు నేటికీ తక్కువ వేతనలతో పని చేస్తున్నారని ఈఎస్ఐ, పిఎఫ్ సక్రమ అమలు లేకపోవడం కాంట్రాక్టు ద్వారా జీతాలు చెల్లింపులు ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి సమస్యలు కార్మికుల తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని వారు పేర్కొన్నారు ఈనెల 27వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ లో నిర్వహించనున్న చలో విజయవాడ మహా ధర్నాకు జిల్లాల నుంచి ఆర్టీసీ ఔట్సోర్సింగ్ కార్మికులు కార్మిక సంఘాల నాయకులు కార్మిక సోదరులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో నాయుడు విశ్వేశ్వరరావు వెంకట భగవాన్ హర్షవర్ధన్ పృద్వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు




## 30న కలెక్టరేట్ వద్ద ధర్నా

**అనకాపల్లి జయ జయహే**

రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల జీతాలు పెంచాలని జూలై 30న కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు అనకాపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో పిలుపునివ్వడం జరిగింది ఆచార్య రంగ వ్యవసాయ పరిశోధన క్షేత్రం వద్ద జరిగిన కార్మికుల సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా కార్మికుల జీతాలు పెంచకపోవడం వలన ఒకపక్క నిత్యవసర ధరలు విపరీతంగా పెరిగాయని తక్కువ జీతాలతో కార్మికుల అర్థాకలతో ఇబ్బందులు పడుతున్నారని సమాన పనికి సమాన వేతనం ఎక్కడ అమలు కావడం లేదని కూటమి ప్రభుత్వం అధికారంలో రాకముందు కార్మికుల సమస్యల పరిష్కారం చేస్తామని వేతనాల పెంచుతామని ఆనాడు హామీ ఇచ్చారని ఇది ఎక్కడ ఇప్పుడు అమలు కావడం లేదని అమలు చేయలేదని వారి పేర్కొన్నారు కావున తక్షణమే జీతాలు పెంచాలని జూలై 30న జరుగు కలెక్టరేట్ ధర్నాలో కార్మికులందరూ పాల్గొని ఈ ధర్నాను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ తేలయ్య బాబు రాష్ట్ర నాయకులు నందీశ్వర రావు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## రంగంలోకి కుంకీ ఏనుగులు

**మొదటి పేజీ తరువాయి...**

పూలమాలలు వేశారు. చెరకు గడల్ని ఆహారంగా అందించారు. అనంతరం పార్వతీపురం మన్యం జిల్లా గుచ్చిమి క్యాంపునకు తరలిస్తున్నారు. అక్కడ సంచరించే అడవి ఏనుగులను దూర ప్రాంతాలకు తరలించేందుకు వినియోగిస్తారు. వాటిని కట్టడి చేసేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుంటారు. కుంకీ ఏనుగుల రెండో అంచె ప్రయాణాన్ని జెండా ఊపి ప్రారంభించారు. జయంత్, అభిమన్యులకు గతంలో ఇలాంటి ఆపరేషన్లు నిర్వహించిన అనుభవం ఉంది. అందుకే ముందుగా వాటిని అక్కడికి పంపిస్తున్నారు. ఒడిశా నుంచి అడవి ఏనుగులు వచ్చి పంటపొలాల్ని ధ్వంసం చేస్తున్నాయని, అక్కడి ప్రభుత్వంతో కూడా చర్చలు జరపాలని పవన్ కల్యాణ్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఒడిశా నుంచి కూడా కొన్ని కుంకీ ఏనుగుల్ని రప్పించి అడవి ఏనుగుల్ని నియంత్రించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈలోగా మనవద్ద ఉన్న కుంకీలతో వీలైనంత మేర అడవి ఏనుగుల్ని అడవిలోకి పంపించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నేపథ్యంలో కుంకీల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై అటవీ శాఖ అధికారులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. గుచ్చిమి క్యాంపునకు చేరిన అనంతరం నిపుణుల పర్యవేక్షణలో అక్కడి వాతావరణ పరిస్థితులకు అలవాటుపడేలా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జయంత్, అభిమన్యుల సేవలు అడవి ఏనుగుల నియంత్రణకు ఎంతో ఉపయోగపడనున్నాయని పేర్కొన్నారు.

## ఎన్టీఏపై ఉక్కుపాదం

**మొదటి పేజీ తరువాయి...**

తొలగించింది. అంతేకాకుండా, వారిపై వచ్చిన నివేదికల ఆధారంగా కొంతమంది అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ నిర్ణయించింది. ఏజెన్సీ నిర్మాణం, పనితీరులో సమగ్ర మార్పు ప్రక్రియను ప్రారంభించింది. విద్యా మంత్రిత్వ శాఖ ప్రకారం, పరీక్షా విధానాన్ని మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా, జవాబుదారీగా మార్చేందుకు, ఎన్టీఏ పూర్తిగా ప్రక్షాళన చేసే దిశగా ఈ చర్య ఒక ముఖ్యమైన ముందడుగు. నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులలో పెరుగుతున్న ఆగ్రహం కారణంగానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఏఎన్ఐ నివేదిక పేర్కొంది. గురువారం అంతకుముందు, కేంద్ర ప్రభుత్వం 17 మంది ఐఏఎస్ అధికారులను మారుస్తూ భారీ మార్పులు చేసింది. ఉన్నత విద్యాశాఖ ప్రస్తుత కార్యదర్శిని ఆయన పదవి నుంచి తొలగించారు. ఆయన స్థానంలో 1994 బ్యాచ్ ఐఏఎస్ అధికారి నరేష్ పాల్ గంగ్వార్ నియమితులయ్యారు.

## పారదర్శక పరీక్షా విధానంతో యువతకు భరోసా

(ప్రతాప్)




పోటీ పరీక్షల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో లక్షలాది మంది యువత ఏళ్ల తరబడి కష్టపడుతుంటారు. కుటుంబాలు తమ ఆర్థిక స్థోమతకు మించి కోచింగ్, పుస్తకాలు, వసతి కోసం ఖర్చు చేస్తాయి. విద్యార్థులు నిద్రాహారాలు మానుకొని పరీక్షల కోసం సిద్ధమవుతారు. అలాంటి సమయంలో పరీక్షకు కొద్ది గంటల ముందు ప్రశ్నాపత్రం లీక్ కావడం వారి శ్రమను, ఆశయాలను క్షణాల్లో ఛిద్రం చేస్తుంది. ఇది కేవలం పరీక్ష నిర్వహణలో జరిగిన లోపం కాదు. నిజాయితీగా శ్రమించిన లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దోచుకునే ఘోరమైన సామాజిక నేరం. ప్రతిభపై ప్రజల్లో నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదకర పరిణామం.

దేశవ్యాప్తంగా ఇటీవలి కాలంలో ప్రశ్నాపత్రాల లీకేజీలు ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయి. వివిధ నివేదికల ప్రకారం 2017 నుంచి 2024 మధ్య దేశంలోని 15 రాష్ట్రాల్లో సుమారు 70 ప్రధాన పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ కావడంతో దాదాపు 1.7 కోట్ల మంది అభ్యర్థులు ప్రభావితమయ్యారు. గత రెండేళ్లలోనే నీట్-యూజీ, యూజీసీ-నెట్, ఉత్తరప్రదేశ్ పోలీసు నియామక పరీక్ష, ఉపాధ్యాయ నియామక పరీక్షలు వంటి కీలక పరీక్షలు లీకేజీల కారణంగా రద్దు కావడం లేదా తిరిగి నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని పరీక్షల్లో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్షలకు హాజరుకావాల్సి వచ్చింది. ఆర్థిక నష్టం మాత్రమే కాదు, తీవ్రమైన మానసిక ఒత్తిడి, నిరాశ, ప్రభుత్వ వ్యవస్థలపై అవిశ్వాసం కూడా పెరిగాయి.

ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం--2024' ఒక సానుకూల అడుగు. వ్యవస్థీకృతంగా ప్రశ్నాపత్రాలు లీక్ చేసే ముఠాలకు పదేళ్ల వరకు జైలు శిక్ష, భారీ జరిమానా విధించే నిబంధనలు ఇందులో ఉన్నాయి. అయినప్పటికీ చట్టం ఉండటం ఒక్కటే సరిపోదు. నేరస్తులు సంవత్సరాల తరబడి శిక్షకు దూరంగా ఉంటే చట్టం భయాన్ని కలిగించదు. విచారణ వేగంగా పూర్తవాలి. ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారణ జరిపి కొద్ది నెలల్లోనే తీర్పులు వెలువడేలా చర్యలు తీసుకోవాలి.

పరీక్షల నిర్వహణలో కూడా సమూల మార్పులు అవసరం. ప్రశ్నాపత్రాల ముద్రణ, రవాణా, భద్రత మొత్తం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించాలి. ఎన్‌క్రిప్టెడ్ డిజిటల్ విధానంలో పరీక్ష ప్రారంభానికి కొద్ది గంటల ముందే ప్రశ్నాపత్రాలు పరీక్షా కేంద్రాలకు చేరే వ్యవస్థను అమలు చేయాలి. ముద్రణ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌లు, పరీక్షా కేంద్రాల్లో నిరంతర సీసీటీవీ పర్యవేక్షణ, బయోమెట్రిక్ ధృవీకరణ, కృత్రిమ మేధ ఆధారిత భద్రతా వ్యవస్థలు తప్పనిసరి చేయాలి. పరీక్షల నిర్వహణలో భాగస్వామ్యమయ్యే అధికారుల బాధ్యతను స్పష్టంగా నిర్ధారించి, నిర్లక్ష్యం లేదా కుమ్మక్కు నిరూపితమైతే కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రశ్నాపత్రాల లీకేజీల ద్వారా అక్రమంగా సంపాదించిన ఆస్తులను స్వాధీనం చేసుకునే విధానాన్ని కూడా కచ్చితంగా అమలు చేయాలి.

విద్యా వ్యవస్థకు విశ్వసనీయతే ప్రాణం. ప్రశ్నాపత్రం లీక్ అయిన ప్రతిసారీ ఒక పరీక్ష మాత్రమే రద్దు కావడం కాదు; ప్రతిభపై సమాజానికి ఉన్న నమ్మకం కూడా దెబ్బతింటుంది. యువతలో నిరాశ పెరిగితే అది దేశ అభివృద్ధిపైనా ప్రభావం చూపుతుంది. అందుకే ప్రశ్నాపత్రాల లీకేజీలను సాధారణ నేరాలుగా కాకుండా దేశ యువశక్తిపై జరిగే దాడిగా పరిగణించాలి. కఠిన చట్టాలు, కఠిన అమలు, ఆధునిక సాంకేతిక భద్రత, వేగవంతమైన న్యాయ ప్రక్రియ---ఈ నాలుగు స్తంభాలపైనే పారదర్శక పరీక్షా వ్యవస్థ నిర్మాణం సాధ్యమవుతుంది. నిజాయితీగా శ్రమించే ప్రతి విద్యార్థికి న్యాయం జరిగేలా ప్రభుత్వాలు రాజీ లేని వైఖరి అవలంబించినప్పుడే ప్రతిభకు తగిన గౌరవం లభిస్తుంది; దేశ భవిష్యత్తు సురక్షితమవుతుంది.

# తొలి ఏకాదశి ప్రాశస్త్యం

(సి.హెచ్.ప్రతాప్)

**ఆషాఢ మాసంలో వచ్చే శుక్ల పక్ష ఏకాదశిని తొలి ఏకాదశి అని, శయని ఏకాదశి అని, మహా ఏకాదశి అని రకరకాల పేర్లతో పిలుస్తారు. వైష్ణవ సాంప్రదాయంలో ఈ పండుగకు అత్యంత విశిష్టమైన ప్రాధాన్యత ఉంది. శ్రీ మహావిష్ణువు ఈ రోజున క్షీరసాగరంలో శేషతల్పంపై యోగనిద్రలోకి వెళ్తాడని సనాతన ధర్మ విశ్వాసం. ఈ యోగనిద్ర కార్తీక శుద్ధ ఏకాదశి అంటే ఉత్థాన ఏకాదశి వరకు నాలుగు నెలల పాటు కొనసాగుతుంది. ఈ నాలుగు నెలల సమయాన్ని చాతుర్మాస్య కాలం అని పిలుస్తారు. తొలి ఏకాదశితోనే చాతుర్మాస్య వ్రతం ప్రారంభమవుతుంది. ఈ నాలుగు నెలల కాలంలో మునులు, సన్యాసులు, పీఠాధిపతులు ఒకే చోట నివసిస్తూ ఆధ్యాత్మిక చింతనలో కాలం గడుపుతారు. నిష్ఠతో వ్రతాలు ఆచరించడం, జప తపాలు చేయడం, వేద పారాయణం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత సమకూరుతుందని నమ్ముతారు.**



శయనీ ఏకాదశి మహత్యాన్ని తెలియజేసే విష్ణు శ్లోకం:
సుప్తే త్వయి జగన్నాథ జగత్సుప్తం భవేదిదమ్।
విబుద్ధే త్వయి బుద్ధ్యేత జగత్సర్వం చరాచరమ్॥

భావం:
ఓ జగన్నాథా! నువ్వు యోగనిద్రలోకి వెళ్లినప్పుడు ఈ చరాచర జగత్తు అంతా నిద్రిస్తుంది. నువ్వు మేల్కొన్నప్పుడు ఈ సమస్త చరాచర ప్రపంచం మళ్లీ చైతన్యవంతమై మేల్కొంటుంది.
ఏకాదశి ఉపవాస వ్రత సంకల్ప శ్లోకం:
ఏకాదశ్యాం నిరాహారో భూత్వా అహం అపరే2హని।
భోక్ష్యామి పుండరీకాక్ష శరణం మే భవ అచ్యుత॥

భావం:
తామర రేకుల వంటి కన్నులు కలిగిన ఓ పుండరీకాక్షా! అచ్యుతా! నేను ఏకాదశి తిథి నాడు నిరాహారంగా ఉపవాసం ఉండి, మరుసటి రోజున పారణ చేసి భోజనం చేస్తాను. నన్ను అనుగ్రహించి నాకు శరణు ప్రసాదించు.

భారతీయ సనాతన సంస్కృతిలో ఏకాదశి తిథికి విశేషమైన ప్రాముఖ్యత ఉనికిలో ఉంది. సంవత్సరం మొత్తంలో వచ్చే ఇరవై నాలుగు ఏకాదశుల్లో ఆషాఢ ఏకాదశి సంవత్సరం ప్రథమంలో ప్రాధాన్యం పొందే తొలిది కావడం వల్ల దీనికి తొలి ఏకాదశి అనే పేరు స్థిరపడింది. ఈ పవిత్ర దినాన ఉదయాన్నే లేచి కాలకృత్యాలు తీర్చుకుని అభ్యంగన స్నానం ఆచరిస్తారు. ఇంటిని పరిశుభ్రం చేసుకుని తోరణాలు కట్టి శ్రీమహావిష్ణువును, లక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. తులసి దళాలతో విష్ణుమూర్తికి పూజ చేయడం అత్యంత శ్రేయస్కరంగా భావిస్తారు. ఈ రోజున ఉపవాసం ఉండటం ప్రధాన ఆచారం. జ్ఞానేంద్రియాలు ఐదు, కర్మేంద్రియాలు ఐదు తో పాటు మనస్సును అదుపులో ఉంచుకుని భగవంతునిపై దృష్టి లగ్నం చేయడమే ఉపవాసంలో దాగి ఉన్న ఆధ్యాత్మిక అంతరార్థం. ఉపవాసం ద్వారా శరీరానికి పరిపూర్ణ విశ్రాంతి లభించడమే కాకుండా శరీరంలో ఉన్న విషపదార్థాలు తొలగిపోయి ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుంది.

రాత్రి వేళల్లో జాగరణ చేయడం ఈ పండుగలో మరొక ముఖ్యమైన ఘట్టం. జాగరణ సమయంలో నిద్రపోకుండా విష్ణు సహస్రనామ పారాయణం, హరినామ సంకీర్తనలు, భగవద్గీతా పఠనం చేస్తూ రాత్రంతా విష్ణు చింతనలో గడపడం వల్ల సర్వ పాపాలు తొలగిపోయి పుణ్యఫలాలు లభిస్తాయని పద్మ పురాణం చెబుతోంది. తొలి ఏకాదశి నాడు ప్రత్యేక ప్రసాదంగా పేలాలు, బెల్లం, యాలకుల పొడి కలిపి తయారు చేసిన పేలాల పిండిని నైవేద్యంగా సమర్పించి స్వీకరిస్తారు. ఈ ప్రసాదం వెనుక ఆధ్యాత్మిక భావనతో పాటు శాస్త్రీయ, ఆరోగ్య కారణాలు కూడా ఉన్నాయి. ఆషాఢ మాసంలో వర్ష రుతువు ప్రారంభమవుతుంది. ఈ సమయంలో వాతావరణంలో సంభవించే ఉష్ణోగ్రతల మార్పుల వల్ల మానవ శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గే అవకాశం ఉంటుంది. పేలాల పిండి శరీరానికి తక్షణ శక్తిని ఇవ్వడమే కాక శరీరంలో వేడిని కలిగిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరచి వర్షాకాలంలో సంభవించే రకరకాల రుగ్మతల నుండి రక్షణ కల్పిస్తుంది.

రైతులకు, వ్యవసాయ రంగానికి ఈ పండుగతో అవినాభావ సంబంధం ఉంది. వర్షాకాలం ఆరంభమయ్యే సమయం కావడం వల్ల రైతులు ఈ రోజున తమ పొలాల్లో వ్యవసాయ పనులు ప్రారంభించడానికి ఆయత్తమవుతారు. కాడి ఎద్దులను శుభ్రం చేసి అలంకరించి పూజిస్తారు. ప్రకృతి సమతుల్యతను కాపాడుతూ సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని భూమి తల్లిని, మేఘాలను ప్రార్థిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పండుగను ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. ప్రజలంతా ఏకమై ప్రకృతిని గౌరవించే సాంప్రదాయానికి ఈ రోజు ప్రతీకగా నిలుస్తుంది.

ఈ పండుగ మానవులకు క్రమశిక్షణ, సంయమనం, భక్తి మార్గాలను నేర్పుతుంది. ఆషాఢ మాసపు వర్షాల వల్ల వ్యాపించే క్రిమికీటకాలు, రుగ్మతల నుండి రక్షణ పొందేలా ఆచార వ్యవహారాలు నిబంధించబడ్డాయి. భౌతిక జీవిత సాధనలతో పాటు ఆధ్యాత్మిక పురోగతికి తొలి ఏకాదశి దోహదపడుతుంది. జీవుడు పరమాత్మను చేరుకోవడానికి అవసరమైన నిర్మలమైన మనస్సును పెంపొందించుకోవడానికి ఈ దినం అత్యంత అనుకూలమైనది. పంచభూతాలను, ప్రకృతిని దైవంగా భావించి పూజించే సాంప్రదాయాన్ని భావితరాలకు అందించడంలో తొలి ఏకాదశి విశేష ప్రాముఖ్యతను కలిగి ఉంది.

# వృద్ధాప్యం ఒక శాపం కాకూడదు

(సి.హెచ్.ప్రతాప్)

"మాతృదేవో భవ, పితృదేవో భవ" అని భారతీయ సంస్కృతి తల్లిదండ్రులను దైవస్వరూపాలుగా గౌరవించమని బోధించింది. జీవితమంతా కుటుంబం కోసం శ్రమించి, పిల్లల భవిష్యత్తు కోసం తమ కోరికలను త్యాగం చేసిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ప్రేమ, ఆప్యాయత, భద్రతను ఆశించడం సహజం. అయితే ఆధునిక జీవనశైలి, చిన్న కుటుంబాల పెరుగుదల, పట్టణీకరణ, ఉపాధి కోసం వలసలు వంటి కారణాల వల్ల వృద్ధుల సంరక్షణ నేడు సామాజిక సవాలుగా మారుతోంది.

భారతదేశంలో వృద్ధుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం రానున్న దశాబ్దాల్లో దేశ జనాభాలో వృద్ధుల శాతం గణనీయంగా పెరగనుంది. ఈ నేపథ్యంలో వారి ఆరోగ్యం, ఆర్థిక భద్రత, మానసిక ప్రశాంతత, సామాజిక గౌరవాన్ని కాపాడేందుకు కుటుంబాలతో పాటు సమాజం, ప్రభుత్వ వ్యవస్థలు కూడా సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది.

వృద్ధాప్యంలో శారీరక అనారోగ్యంతో పాటు ఒంటరితనం, నిర్లక్ష్యం, భావోద్వేగ ఒత్తిడి కూడా పెద్ద సమస్యలుగా మారుతున్నాయి. చాలామంది పిల్లలు ఉద్యోగాల కోసం దూర ప్రాంతాల్లో ఉండటంతో తల్లిదండ్రులు ఒంటరిగా జీవించాల్సి వస్తోంది. కొంతమంది వృద్ధులు ఆశ్రయ గృహాలకు వెళ్లాల్సిన పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయి. వారికి కావలసింది కేవలం మందులు కాదు; ఆప్యాయమైన పలకరింపు, కొంత సమయం, ఆత్మీయత, గౌరవం కూడా అంతే ముఖ్యమైనవి.

ఇటీవలి కాలంలో దేశంలోని పలు ప్రాంతాల్లో హృదయాన్ని కలచివేసే సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. కొందరు పిల్లలు ఆస్తులను తమ పేర్లకు మార్చించుకున్న తర్వాత తల్లిదండ్రులను ఇంటి నుంచి బయటకు పంపిన ఘటనలు వార్తల్లో కనిపిస్తున్నాయి. మరికొందరు వృద్ధులను ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించి తిరిగి తీసుకెళ్లకుండా వదిలేసిన సంఘటనలు నమోదయ్యాయి. కొన్ని సందర్భాల్లో వృద్ధ దంపతులు తమ పిల్లలు విదేశాల్లో లేదా ఇతర నగరాల్లో స్థిరపడడంతో నెలల తరబడి ఒంటరిగా జీవిస్తూ, పొరుగువారి సహాయంపైనే ఆధారపడాల్సి వస్తోంది. మరికొన్ని వృద్ధాశ్రమాల్లో చేరిన వారు తమ పిల్లలు పండుగ రోజునైనా చూడటానికి రారని కన్నీటి కళ్లతో చెప్పిన వాస్తవాలు సమాజాన్ని ఆలోచింపజేస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు వ్యక్తిగత



వైఫల్యాలు మాత్రమే కాదు, కుటుంబ విలువలు క్షీణిస్తున్నాయనే విషయాన్ని కూడా గుర్తు చేస్తున్నాయి.

సమాజంలో వృద్ధులను భారంగా కాకుండా అనుభవ సంపదగా చూడాలి. "అభివాదనశీలస్య నిత్యం వృద్ధోపసేవినః, చత్వారి తస్య వర్ధంతే ఆయుర్విద్యా యశో బలమ్" అనే సంస్కృత సూక్తి వృద్ధులను గౌరవించే వారికి ఆయురారోగ్యాలు, జ్ఞానం, కీర్తి, బలం పెరుగుతాయని చెబుతోంది. అలాగే "యత్ర పూజ్యంతే వృద్ధాః తత్ర తిష్ఠంతి దేవతాః" అనే భావన పెద్దలకు గౌరవం ఉన్న చోటే శుభం, శాంతి నెలకొంటాయని తెలియజేస్తుంది. వారి జీవితానుభవాలు యువతకు విలువైన మార్గదర్శకత్వాన్ని అందించగలవు. కుటుంబ నిర్ణయాల్లో వారి అభిప్రాయాలకు స్థానం కల్పించడం, మనవలు-మనవరాళ్లతో సమయం గడిపే అవకాశాలను కల్పించడం కుటుంబ బంధాలను మరింత బలపరుస్తుంది.

వృద్ధుల కోసం అందుబాటులో ఉండే వైద్య సేవలు, ఇంటి వద్ద ఆరోగ్య పరీక్షలు, అత్యవసర సహాయ వ్యవస్థలు, డే-కేర్ కేంద్రాలు, మానసిక ఆరోగ్య సలహా సేవలు, వినోద కార్యక్రమాలు వంటి సౌకర్యాలను విస్తరించాలి. స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, యువజన సంఘాలు వృద్ధులతో తరచూ మమేకమై వారి అవసరాలను తెలుసుకునే కార్యక్రమాలను చేపట్టాలి. డిజిటల్ సేవలను వినియోగించేలా వారికి శిక్షణ ఇవ్వడం ద్వారా బ్యాంకింగ్, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ పథకాలను సులభంగా పొందే అవకాశం కల్పించవచ్చు. కుటుంబ సభ్యులు వారానికి కొంత సమయాన్ని పెద్దలతో గడపడం, వారి ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పరిశీలించడం, వారి అభిప్రాయాలను శ్రద్ధగా వినడం వంటి చిన్న ప్రయత్నాలే వారికి అపారమైన ఆనందాన్ని అందిస్తాయి.

వృద్ధులను గౌరవించడం కేవలం కుటుంబ ధర్మమే కాదు, నాగరిక సమాజానికి కొలమానం కూడా. నేడు మనం వారికి అందించే ప్రేమ, ఆదరణ, సంరక్షణ రేపు మనకు తిరిగి లభించే సామాజిక సంస్కృతికి పునాది అవుతుంది. ప్రతి ఒక్కరూ ఒక రోజు వృద్ధాప్యాన్ని చేరుకుంటారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. అందువల్ల ప్రతి ఇంటిలో వృద్ధులకు స్థానం, ప్రతి హృదయంలో వారికి గౌరవం, ప్రతి సమాజంలో వారికి భద్రత కల్పించినప్పుడే మన సంస్కృతి సార్ధకమవుతుంది. వృద్ధుల చిరునవ్వును కాపాడటం అంటే మన కుటుంబ విలువలను, మానవత్వాన్ని, భారతీయ సంస్కృతిని కాపాడినట్టే.



## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

అనకాపల్లి జయ జయహే

డాక్టర్ విద్యను అభ్యసించే నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది . అందులో భాగంగా స్థానిక మునగపాక గ్రామంలో కాలేజీ విద్యార్థులు నిరసన చేపడుతూ మానవహారం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది . మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం కనీసం పరీక్షలను కట్టుదిట్టంగా కూడా నిర్వహించలేని అసమర్థతో ఉన్నదని నీటి పరీక్ష రాసిన 22 లక్షల మంది విద్యార్థులు జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చలగాటాలు ఆడుతున్నదని ఆయన అన్నారు. ఈ అసమర్థత నాయకుడు నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు బిజెపి ప్రభుత్వం దీనికి మౌనం వహిస్తుందని యువత విద్యార్థులు దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న దేశ రాజధానిలో ఢిల్లీలో విద్యార్థులపై పోలీసులను ఉపయోగించి విచక్షణ రహితంగా వారిపై దాడి చేయిస్తున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం దేశ యువత డిమాండ్ గా ఉన్న విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జగ్గప్పారావు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## నవరాత్రి మహోత్సవంలో పాల్గొన్న కొనతాల

అనకాపల్లి జయ జయహే




ఉత్తరాంధ్ర ఇలవేల్పు ఆరాధ్య దైవం అని శ్రీశ్రీశ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో వారాహి నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు అందులో భాగంగా స్థానిక ఎమ్మెల్యే కొనతాల రామకృష్ణ శ్రీ నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని వారాహి అమ్మవారు పూజా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.దేవాలయ పాలకవర్గ సభ్యులు ఆలయ చైర్మన్ పీల నాగ శ్రీను( గొల్ల బాబు ) ఆయనకు ఘనంగా మేళతాళాలతో వేద పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య పూర్ణ కుంభంతో ఘనంగా స్వాగతం పలకడం జరిగింది.అర్చకులు సందీప్ శర్మ స్థానిక ఎమ్మెల్యే చే వారాహి అమ్మవారి ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజ, పుష్పాభిషేకం నిర్వహించడం జరిగింది వీరికి దేవాలయ పాలకవర్గ సభ్యులు ఘనంగా దుస్సాలువతో సత్కరించి వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థ ప్రసాదములు మరియు అమ్మవారి చిత్రపటం బహుకరించడం జరిగింది ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు, భక్తులు మాలాధారణ భక్తులు ఈ పూజలో పాల్గొనడం జరిగింది



## పట్టణ సమస్యలపై కమిషనర్‌తో బీజేపీ నాయకులు భేటీ...

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

నిడదవోలు పట్టణంలో నెలకొన్న పలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణిని కలిసి వినతిపత్రం అందజేశారు. బస్టాండ్--రాధాకృష్ణ థియేటర్ రహదారి పనులు వేగంగా పూర్తి చేయాలని, అన్నా క్యాంటీన్ రోడ్డు నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని, ఉజ్జినవారి వీధి డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అలాగే పట్టణంలోని రహదారులు, డ్రైనేజీలు, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం 'స్వచ్ఛ ఆంధ్ర--ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమంలో నిడదవోలు మున్సిపాలిటీకి అవార్డు దక్కేలా కృషి చేసిన కమిషనర్ కృష్ణవేణిని బీజేపీ నాయకులు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గూడూరి నరసింహరాజు, పట్టణ ఇన్‌చార్జి దేవన వెంకట పాపారావు, బండి సత్యనారాయణ, నీలం రామారావు, బలగం వెంకట సతీష్, తోరం జె. శ్రీనివాస్, గుడ్ల గోవింద్, కే. అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



## డొక్కా సీతమ్మ హైస్కూల్‌లో మెగా పేరెంట్స్ డే నిర్వహణ....

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

నిడదవోలులోని డొక్కా సీతమ్మ ఓరియంటల్ మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నేతల భీమారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి నిడదవోలు మున్సిపల్ కమిషనర్ టీ. కృష్ణవేణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న మున్సిపల్ కమిషనర్ టీ.కృష్ణవేణిని ప్రధానోపాధ్యాయుడు నేతల భీమారావు, పాఠశాల సిబ్బంది శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం కమిషనర్ టీ. కృష్ణవేణి మాట్లాడుతూ, విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. పిల్లల చదువుతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణను అలవర్చే బాధ్యత కుటుంబాలపై ఉందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పరస్పర సహకారంతో పనిచేస్తే విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసీ చైర్మన్ వి. చందు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా ప్రజలకు అన్ని రకాల సేవలు అందిస్తాం

**చోడవరం జూలై 24 జయ జయహే**



చోడవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల ప్రజలకు అన్ని రిజిస్ట్రేషన్ సేవలు అందించడానికి సబ్-రిజిస్ట్రార్, వారీ సిబ్బంది అందుబాటులో ఉన్నారనీ చోడవరం సబ్ రిజిస్ట్రార్ బి గీతా లక్ష్మీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.మేము దస్తావేజును సిద్ధం చేయడం,పబ్లిక్ డేటా ఎంట్రీ చేయడం( పిడిఎఫ్), చలానా కట్టడం,మార్కెట్ విలువలు,ఈ సి లు, నకలు తెలియజేయడం ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఉచితంగా పూర్తి చేస్తామన్నారు. అలాగే దస్తావేజు తయారీ, పి డి ఈ ఎంట్రీ, రిజిస్ట్రేషన్ ప్రక్రియ లకు ప్రత్యేక హెల్ప్ డెస్క్ లు రిజిస్ట్రార్ కార్యాలయం నందు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాబట్టి ప్రజలందరూ మా సేవలను వినియోగించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## మెకానిక్ షాపులో అగ్ని ప్రమాదం

### రూ..5 లక్షలు నష్టం

**మాడుగుల,జూలై 24, జయ జయ హే**



మాడుగుల మెయిన్ రోడ్డు రాజవీది లో శుక్రవారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ మెకానిక్ షాప్ పూర్తిగా దగ్ధమైంది. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో వడ్డాది చిన్నారావు షాపులో షార్ట్ సర్క్యూట్ మూలంగా ఈ ప్రమాదం చోటుచేసుకుందని చెబుతున్నారు. దీంతో దుకాణం లో గల వివిధ రకాల ఎలక్ట్రానిక్ వస్తువులు జిరాక్స్ మిషన్ వంటి విలువైన వస్తువులు కానీ బూడిద అయ్యాయి. సమాచారం అందుకున్న మాడుగుల జ్ఞాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు. అయినప్పటికీ వస్తువులన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి. ఫైర్ సిబ్బంది సి ఆర్ ఈ డబ్ల్యు వి రాజేశ్వర రావు,ఎస్ ఎఫ్ ఓ ఎల్ వెంకటరావు,డ్రైవర్ పి ఎస్ ఎస్ వర్మ తదితరులు పాల్గొని మంటలు అదుపు చేశారు.వారి అంచనా ప్రకారం 150,000 నష్టం జరిగినట్టు చెప్పారు.అయితే షాప్ యజమాని మాత్రం అయిదు లక్షలు పైగా ఉంటాదని చెప్పారు.




## కూటమి ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం

### ఎమ్మెల్యే రాజు

**బుచ్చియ్యపేట జయ జయహే**

కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. శుక్రవారం వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల,జడ్పీ హైస్కూల్, కేజీబీవీ విద్యాలయాల్లో మెగా పేరెంట్స్ మీటింగ్ కి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు జూనియర్ కళాశాలలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు.వడ్డాదిని విద్యా హబ్ గా తీర్చిదిద్దుతామన్నారు.జడ్పీటీసీ దొండా రాంబాబు విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుకు కృషి చేస్తానన్నారు.అవసరమైతే మరిన్ని బిల్డింగ్స్ నిర్మిస్తామన్నారు. వడ్డాది హైస్కూల్లో విద్యార్థులకు మరుగుదొడ్లకు తక్షణమే మరమ్మతులు చేపడతామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు నడవడిక, చదువుపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. విద్యతోనే పేద ప్రజల జీవన ప్రమాణ స్థాయి మెరుగుపడుతుంది అన్నారు.జెడ్పిటిసి దొండా రాంబాబు,విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ,కూటమినేతలు దొండా నరేష్, సన్యాసిరావు,గిరిబాబు, సిరిగిరి శెట్టి శ్రీరామమూర్తి,సయ్యపురెడ్డి శ్రీనివాస్,మాజీ ఎంపిపి దాడి గోవింద, సింగంపల్లి రమేష్,కుబిరెడ్డి వెంకట్రావు,వీర్ల సురేష్, బిజెపి నేత దొండా నానాజీ, వైసీపీ నేత కోవెల జనార్ధనరావు,రిటైర్డ్ ఎస్సై ఎస్వీ రమణ, కాలేజీ ప్రిన్సిపాల్ చిన్నారావు, హైస్కూల్ హెచ్ఎం ప్రసన్న కళ, ఎస్ఎంసి చైర్మన్ కోవెల వెంకటరమణ, కేజీబీవీ ప్రిన్సిపాల్ పరిమళ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.వడ్డాది జడ్పీ హైస్కూల్లో మెగా పేరెంట్స్ మీటింగ్ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులకు పలు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కేజీబీవీలో విద్యార్దినులు ఆటపాటలతో అలరించారు.



## వడ్డాది గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

### ఎమ్మెల్యే రాజు

**బుచ్చియ్యపేట జయ జయహే**

వడ్డాది గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. శుక్రవారం వడ్డాది కొత్తూరులో రూ.2 లక్షల వ్యయంతో త్రాగునీటి పైప్లైన్ మరమ్మత్తులకు శంకుస్థాపన చేశారు. అదట్రావువీధి రావుకచ్చీ రాళ్ళ వద్ద మరో రూ.2 లక్షలతో మరమ్మత్తులు చేపట్టేందుకు భూమి పూజ చేశారు.కొత్తూరు సాయిబాబా గుడి ఎదురుగా జోర్లు పొలాలకి వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మాణాలకు తొలివిడతలో రూ.25 లక్షల నుండి 50 లక్షల వరకు మంజూరు చేస్తామన్నారు.గ్రామంలో ఉన్న పెండింగ్ సమస్యలన్నీ త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కళ్యాణం మండపం నిర్మాణానికి కూడా రూ.1కోటి విఎంఆర్డీఏ నిధులు మంజూరయ్యాయి అన్నారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేస్తామన్నారు కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళు అన్నారు.గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే వడ్డాదిలో ఎక్కువగా అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక సమస్యలు వ్యక్తిగత సమస్యలపై ఎమ్మెల్యేకి విన్నవించుకున్నారు.విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీడీవో శివప్రసాద్ నారాయణ,స్థానిక కూటమి నేతలు తమరాన దాసు, దొండా సన్యాశి రావు,గిరిబాబు, ఎస్.శ్రీరామూర్తి, సయ్యపురెడ్డి శ్రీనివాస్, సింగంపల్లి రమేశ్, కుబిరెడ్డి వెంకట రావు,వీర్ల సురేష్,ఎస్.పేరమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మెగా పేరెంట్-టీచర్ 4.0

### విద్యార్థుల అభివృద్ధికి తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమిష్టి కృషి అవసరం

**రామచంద్రపురం, జూలై 24: (జయ జయహే )**

రామచంద్రపురం స్థానిక రత్నంపేట మున్సిపల్ హైస్కూల్ ల్లో శుక్రవారం మెగా పేరెంట్--టీచర్ మీటింగ్ 4.0 ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రముఖులు వైట్ల సూర్యప్రకాశ్‌రావు, బి. రామసుబ్బారావు, సతీష్, గుణ్ణం రామకృష్ణ, పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు వి. సుబ్బారావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు కె. శ్రీరాములు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వైట్ల సూర్యప్రకాశ్‌రావు మాట్లాడుతూ, గతంలో పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేశానని, భవిష్యత్తులో కూడా పాఠశాలకు ఏ అవసరం వచ్చినా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమం లో బి. రామసుబ్బారావు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ఎస్. పద్మావతి పూర్వ ప్రధానోపాధ్యాయులు వి. సుబ్బారావు ప్రసంగించారు .ఈ సందర్భంగా 'తల్లికి వందనం' కార్యక్రమాన్ని విద్యార్థులు అత్యంత అద్భుతంగా నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. తల్లిదండ్రుల కోసం నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే ప్రభుత్వ సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులు, తల్లిదండ్రులకు భోజనాలు ఏర్పాటు చేశారు.మెగా పేరెంట్--టీచర్ మీటింగ్ విజయవంతంగా నిర్వహించిన పాఠశాల యాజమాన్యాన్ని తల్లిదండ్రులు, అతిథులు అభినందించారు.



## విద్యుత్ ఉద్యోగుల పాత పెన్షన్ అమలు చేయాలి

**అనకాపల్లి జయ జయహే**

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగంలో 1999 -2004 మధ్య నియమితులైన ఉద్యోగులకు జనరల్ ప్రావిడెంట్ ఫండ్ తో పాటు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ఉద్దేశించిన వినతి పత్రాన్ని స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కు స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో యూనియన్ ప్రతినిధులు కలిసి ఆయనకు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఏపీ ఎస్ఈ బీ విభజన అనంతరం ఏర్పాటైన ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యుత్తు సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా లభించాల్సిన పెన్షన్ విధానం భద్రతకు దూరమయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 53 కు అనుగుణంగా విద్యుత్ ఉద్యోగులను కూడా పాత ఫంక్షన్ పథకం జిపిఎఫ్ పరిధిలోకి తీసుకురావాలని వారు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ఏపీ ఎలక్ట్రిక్ సిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు




## నీట్ పేపర్ లికేజ్ చేసిన బాధితులపై చర్యలు తీసుకోవాలి

### ఎస్ఎఫ్ఐ గిరిజన సంఘం సిఐటియు నిరసన.

**అరకులోయ: జూలై 25,జయ జయహే,**

అరకు వేలి మండల కేంద్రంలో ఎస్ ఎఫ్ ఐ, గిరిజన సంఘం సి ఐ టి యు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేయడం జరిగింది. కేంద్ర విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నీట్ పేపర్ లీకేజ్ చేసిన బాధితుల పైన చర్యలు తీసుకోవాలని విద్యార్థిని విద్యార్థులు పైన లాఠీ చార్జీలు చేసిన పోలీసు పైన విచారణ చేపట్టాలని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆశ్రమ పాఠశాల లో హెల్త్ అసిస్టెంట్ నియమించాలని. పెంచిన ఫీజు లు తగ్గించాలని ఎస్ ఎఫ్ ఐ,సీఐటీయు ,ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగింది . ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కె రామారావు, ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ ఐసు బాబు, భీమరాజు, గౌతం ,సంహాద్రి ,చరణ్ సంజీవ్ , గిరిజన సంఘం మండలనాయకులు పాంగి రామన్న తదితరులు పాల్గొన్నారు .



## హుకుంపేటలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

### విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకం: మాజీ సర్పంచ్ పూర్ణిమ

**హుకుంపేట: జూలై 25, జయ జయహే.**

అల్లూరి సీతారామరాజు జిల్లా, హుకుంపేట మండల కేంద్రంలో శుక్రవారం మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హుకుంపేట పంచాయతీ మాజీ సర్పంచ్ సమిడ. వెంకట పూర్ణిమ మండలంలోని పలు పాఠశాలలను, జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. "పిల్లల భవిష్యత్తు బాధ్యత మన అందరిది. బడి, ఇల్లు కలిస్తేనే పిల్లలు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు" అని ఆమె తెలిపారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఉపాధ్యాయులకు సహకరించాలని పూర్ణిమ కోరారు. పాఠశాలల అభివృద్ధికి పంచాయతీ తరపున అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోయ్యూరు బాయ్స్ వన్‌లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ లో పాల్గొన్న డి.ఎల్.పి.ఓ కుమార్

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్, జూలై 25**



అల్లూరి జిల్లా కొయ్యూరు మండల కేంద్రంలో బాయ్స్ వన్ పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ - 4.0 కార్యక్రమానికి డి.ఎల్.పి.ఓ కుమార్, స్థానిక తహసీల్దార్ ప్రసాదరావు హాజరై పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయంగా సమావేశమయ్యారు. డి.ఎల్.పి.ఓ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువును కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయని ఒత్తిడి తగ్గుతుందని మరియు జ్ఞానం శాశ్వతంగా గుర్తుంటుందని అన్నారు. అలాగే మీ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమం లో వైసీపీ వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ, జనసేన నేత నేగ్గే భాను సాయి, ప్రియ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవగాహన కల్పించిన సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ

**సూళ్లూరుపేట,జూలై 24,జయ జయహే:**



సూళ్లూరుపేట పట్టణంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల,కళాశాలలో నిర్వహించిన పేరెంట్స్--టీచర్స్ సమావేశంలో సీఐ మురళీకృష్ణ పాల్గొని మాదకద్రవ్యాల నివారణ,ఈవ్ టీజింగ్,సోషల్ మీడియా మోసాలు,సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని,సోషల్ మీడియాను బాధ్యతాయు-ుతంగా వాడాలని,ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద సంఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.సమాజంలో నేరాల నివారణకు,విద్యార్థుల్లో మంచి విలువలు పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం,అధ్యాపకులు,తల్లిదండ్రులు మరియు సుమారు 1,060 మంది బాలికలు పాల్గొన్నారు.




## తొట్టంబేడులో ఘనంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

**తొట్టంబేడు,జులై 24,జయ జయహే**

మండల కేంద్రమైన తొట్టంబేడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తంగేళ్లపాలెం సింగిల్ విండో బ్యాంకు చైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, తెలుగుదేశం పార్టీ తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం ఎంతో అవసరమని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ బలోపేతానికి చేపడుతున్న చర్యలను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన మంచినీటి శుద్ధి ప్లాంట్ ను, వసతులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ అయ్యప్ప,ఎ.వెంకటేష్,చందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు, తల్లిదండ్రులు,గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల భావి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

**ఏర్పేడు, జులై 24,జయ జయహే.**

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల భావి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు.మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో కలసి పాఠశాల అభివృద్ధి పై చర్చించారు. కూటమి ప్రభుత్వం ఏర్పేడు మండలంలో 'తల్లికి వందనం' పథకం కింద 5,978 మంది విద్యార్థులకు గాను రూ. 7.77 కోట్ల నిధులను సకాలంలో విడుదల చేసిందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ పథకంతో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గఆధ్వర్యంలో అమలవుతున్న 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం', 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి కిట్స్' వంటి పథకాల అమలు తీరుపై తల్లిదండ్రుల అభిప్రాయాలు అడిగి తెలుసుకోగా, వారు తీవ్ర సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కంటి ఆరోగ్య రక్షణ కోసం ఒక కొత్త వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు.అరవింద్ ఐ హాస్పిటల్‌తో కొలాబరేట్ అయ్యి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలవిద్యార్థులందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేసేలా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని తెలిపారు. రాబోయే బుధవారం నుండి నియోజకవర్గంలో ప్రారంభం కానున్న ఈ ప్రత్యేక క్యాంపెయిన్ ద్వారా విద్యార్థులకు మెరుగైన చూపు, ఆరోగ్యం అందించడమే ప్రధాన లక్ష్యం అన్నారు. అనంతరం 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం' పథకంలో భాగంగా విద్యార్థులు తల్లిదండ్రులతో కలసి కింద కూర్చొని భోజనం చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో బాత్రూమ్‌లు, గ్రౌండ్ ఇతర మౌలిక వసతుల కొరతపై విద్యార్థులు తెలిపిన సమస్యలను నోట్ చేసుకున్నారు.



## మెగా పేరెంట్స్ డేలో పాల్గొన్న రెడ్డివారి గురువారెడ్డి.

**ఏర్పేడు, జులై 24,జయ జయహే.**

మండలంలోని బండారుపల్లి జడ్పీ హైస్కూల్ లో జరిగిన మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, నెల్లూరు అర్బన్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డాక్టర్ రెడ్డి వారి గురువారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ సారథ్యంలో మెగా పిటియం డే 4గ్లూ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రంలో ఉన్న 61 వేల పాఠశాలల్లో 74 లక్షల 96 వేల మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు 3 లక్షల 22వేల మంది ఉపాధ్యాయులను అందరినీ సమావేశపరిచి 36918 మంది ప్రజా ప్రతినిధులను కలిపి సమావేశాలు నిర్వహించడం ఒక చారిత్రాత్మకైనవిషయం అన్నారు. కార్యక్రమం లో కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## పల్లె పల్లెకు బి ఎస్ పి పార్టీ కార్యక్రమం,

**పాడేరు: జయ జయహే.**

పాడేరు మండలం పరిధిలోని గొండేలి పంచాయతీ లింగ పుటు గ్రామంలో బహుజన్ సమాజ్ పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు సుర్ల పోతురాజు సందర్శించారు. ఈ సందర్భంగా పల్లె పల్లెకు బి ఎస్ పి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలతో ఆయన మాట్లాడుతూ. డ్రైనేజీ కాలువ లేకపోవడంతో మురికి నీళ్లు నిలువ ఉండడంతో. వ్యాధులు బారిన పడుతున్నామని మంచినీటి సమస్య కూడా చాలా ఎక్కువగా ఉన్నాయని గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు,ఈ సమస్యలపై పరిష్కారమయ్యేలా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని అన్నారు, దీనిపై పరిష్కరించకపోతే నిరసన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాలసీ గణేష్ బాబు. సోమే కొండ బాబు, పాలసీ చిన్నయ్య, కొండపల్లి నాగరాజు. జానీ బాబు. అఖిల్ బాబు. తదితరులు పాల్గొన్నారు.




## స్థానిక ఎన్నికలకు జనసైనికులు సంసిద్ధం కావాలి:

### జనసేన జిల్లా సీనియర్ నాయకులు గురాన అయ్యలు

### జనసేన పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం

**విజయనగరం:(జయ జయహే)**

విజయనగరం నియోజకవర్గ పరిధిలోని 06వ డివిజన్, దాసన్నపేట ప్రశాంతి నగర్‌లో జనసేన పార్టీ డివిజన్ ఇంచార్జ్ దువ్వ రాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జనసేన పార్టీ జిల్లా సీనియర్ నాయకులు గురాన అయ్యలు నూతన కార్యాలయాన్ని ప్రారంభించి, అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ప్రతి డివిజన్ మరియు గ్రామంలో జనసేన పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేసి, ప్రజలకు మరింత చేరువ కావాలని పిలుపునిచ్చారు. జనసేనాని ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని, నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటినుంచే సంసిద్ధం కావాలని సూచించారు. ప్రజా సమస్యలపై అనునిత్యం స్పందిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండి పోరాడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో విజయనగరం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, వీరమహిళలు, జనసైనికులతో పాటు కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు గంటా రవి ,6వ డివిజన్ నాయకులు, శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## లీకులు వద్దు మెరిట్ ముద్దు

### నీట్ స్కాం దేశానికి అవమానం... ఎస్ ఎఫ్ ఐ నిరసన ధ్వనులు

**టెక్కలి జూలై 24 జయ జయహే**

దేశవ్యాప్తంగా ఢిల్లీలో జరిగిన లాఠీ చార్జిని ఖండిస్తూ విద్యా సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు టెక్కలిలో ఎస్ ఎఫ్ ఐ నిరసన ధర్నాను చేపట్టారు. నీట్ స్కాం దేశానికి అవమానకరమని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ దేశానికి కావలసింది లీకులు కాదని మెరిట్ ఎంతో ముద్దని విద్యను హక్కుగా కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఢిల్లీలో జరుగుతున్న విద్యార్థుల ఆందోళన పై చర్చలతో పరిష్కారం చేయాలని దాడులను తక్షణమే ఆపాలని ప్రశ్నించే గొంతుకును ఆపలేరని విద్యార్థులు నిరసనలు చేశారు, కేంద్రం కళ్ళు తెరిచి విద్యార్థులకు నిరుద్యోగులకు న్యాయం చేయాలని విద్యార్థుల ఐక్యతే వర్ధిల్లుతుందని ఎస్ ఎఫ్ ఐ ప్రతినిధులు ఆర్ మహేష్, సిహెచ్ నవీన్ తెలిపారు.



## మాతృశక్తి జాగరణతోనే దేశం సర్వతోముఖాభివృద్ధి

### డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తి. తి. దే.

**జూపాడుబంగ్లా (జయ జయహే)**

మాతృశక్తి జాగరణతోనే దేశం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని, మాతృశక్తి అనేది కేవలం కుటుంబానికే కాదు, సమాజానికీ, దేశానికీ మూలాధారమని, మాతృశక్తి మేల్కొంటే కుటుంబం వికసిస్తుందని, కుటుంబం వికసిస్తే సమాజం బలపడుతుందని, సమాజం బలపడితే దేశం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో గత నాలుగు రోజుల నుండి మండల కేంద్రమైన జూపాడు బంగ్లాలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మూడురోజులు జి. వెంకట రమణయ్య చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలి నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ నిర్వాహకులు ఇల్లూరి లక్ష్మీనారాయణ శ్రేష్ఠి, అర్చకులు సత్యమయ్య, శివయోగి సిద్ధరామేశ్వర నాగలింగేశ్వర బ్రహ్మవిద్యా ఆశ్రమం నిర్వాహకులు గోవిందుస్వామి, ధర్మ ప్రచార మండలి సభ్యులు అంబటి శివశంకర రెడ్డి, అన్నదాన సత్రం నిర్వాహకులు రామయ్య, స్కాలర్స్ ఇ. మీ. పాఠశాల ప్రిన్సిపాల్ కాళ్ళూరి లక్ష్మి, అర్చకులు ఉమ్మయ్య, భజన మండలి సభ్యులు చిన్నతిరుపాలు, జి.రంగస్వామి, బాబు, రాము, కృష్ణమూర్తి, నాగశేషులు, నారాయణరెడ్డి, వెంకటరమణ, శ్రీవీరభద్రస్వామి దేవస్థానం పూజారి పాండురంగస్వామి, మల్లిఖార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈరోజు నుంచి ఆర్టీసీ ప్రమాద రహిత వారోత్సవాలు

**విజయనగరం (జయ జయహే)**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ "ప్రమాద రహిత వారోత్సవాలు" తేది: 25.07.2026 నుండి 31.07.2026 వరకు నిర్వహించుచున్నట్లు విజయనగరం జిల్లా ప్రజా రవాణా అధికారి జి వరలక్ష్మి తెలిపారు. ఇందులో భాగంగా ప్రతీ డిపో లో, రోజు వారి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వాహనం నడిపే సమయములో ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని, నిర్లక్ష్య డ్రైవింగ్, మొబైలు ఫోన్ వినియోగమైనటువంటి ప్రమాద రహిత అలవాట్లకు దూరంగా ఉండాలని తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలియజేసితిరి. డిపో లలో ఉన్న కండక్టర్ మరియు డ్రైవరు లకు రోడ్డు భద్రత పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, శిక్షణ తరగతులు, కౌన్సెలింగ్ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలియజేశారు



## తల్లికి వందనం కార్యక్రమంలో పాల్గొన్న దాడి రత్నాకర్

**(జయ జయహే)**

స్థానిక రామాపురం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆత్మీయ సమావేశం మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ 4.0 భాగంగా తల్లికి వందనం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఐటి విద్య శాఖ మంత్రి నారా లోకేష్ వారు తీసుకుంటున్న మంచి ఆలోచనలతో రాష్ట్ర అభివృద్ధిలో ఉంటున్నదని అంటూ ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య ఒక మంచి ఆలోచన నిర్ణయంతో మంచి వాతావరణం మధ్య విద్యార్థుల భవిష్యత్తును తీర్చి దిద్దడంలో భాగంగా ఇటువంటి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం చాలా బాగుందని ఆయన అన్నారు దీని ద్వారా విద్యార్థులు తల్లిదండ్రులు పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు విద్యార్థుల పురోగతిని తెలుసుకోవచ్చని విద్యార్థులు యొక్క హాజరును చదువు యొక్క పురోగతిని తెలుసుకొని తద్వారా వారి భవిష్యత్తు ప్రణాళిక రచించవచ్చని ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులు తీసుకుంటున్న శ్రద్ధను తల్లిదండ్రులు అడిగి తెలుసుకోవచ్చని మరియు విద్యార్థులు ఇంటి వద్ద చదువుతున్న విధానాన్ని వారి నడవడికను ఉపాధ్యాయులు తెలుసుకునే అవకాశం ఉంటుందని ఇటువంటి సమావేశాలు కు ప్రతి తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరై విద్యార్థుల భవిష్యత్తును తెలుసుకోవాలని ఆయన పేర్కొన్నారు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్ అండ్ టెక్నాలజీ డైట్ కళాశాల బస్సుల ద్వారా డైట్ కళాశాలకు తీసుకువెళ్లి ప్రస్తుతం మారుతున్న ప్రపంచంలో విద్యార్థులకు చదువు యొక్క ఆవశ్యకతను తెలియజేసే విధంగా ఇంజనీరింగ్ విద్యార్థులతో ఇంట్రక్షన్ మరియు ప్రత్యక్షంగా విద్య విధానాన్ని ప్రొఫెసర్ల ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో తెలియజేస్తారని వారన్నారు పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 25 గ్రాములు వెండి నాణేలను బహుకరిస్తామని ఆయన ప్రకటించారు ప్రతి విద్యార్థి మారుతున్న కాలానికి అనుగుణంగా తమ భవిష్యత్తుకు ప్రణాళికలు రచించుకొని దానికి అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు ప్రస్తుత కాలం విద్యార్థి చదువుకోవడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని స్కాలర్షిప్ నగదు పురస్కారాల ద్వారా ఆర్థికంగా సహాయ సహకారాలు అందుతాయని దానికోసం విద్యార్థులు తమ ప్రతిభను పలు పరీక్షలలో చూపవలసి ఉంటుందని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం శాస్త్రి, రాజు, స్కూల్ కమిటీ చైర్మన్ వాసు, కోన శ్రీను, మల్ల శ్రీను, ఎం శ్రీను, మల్ల అప్పారావు, అయితే రామారావు, అయితే లక్ష్మణరావు, దొడ్డి వెంకటరమణ,బుద్ధ సోమేష్, దొడ్డి రమణ, గజ్జి శ్రీనివాసరావు, కాండ్రేగుల శివ, కూటమి నాయకులు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు

# సింహాచలంలో ఎండోమెంట్స్ కార్యదర్శి కన్నబాబు తనిఖీలు

## ఈవోతో కలసి గిరి ప్రదక్షిణ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలన

**సింహాచలం, జూలై 24, జయ జయహే**



ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖ కార్యదర్శి కె. కన్నబాబు శుక్రవారం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను శుక్రవారం ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు, సహాయ కార్య నిర్వహణాధికారి కె తిరుమలేశ్వరరావు ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, సీతారామాచార్యులు నాదస్వరం, వేదమంత్రాల నడుమ కె. కన్నబాబుకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం కప్పస్తంభం ఆలింగనం, బేడా మండపం ప్రదక్షిణ అనంతరం స్వామివారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా, ఈవో జల్లేపల్లి వెంకటరావు శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఈవో జల్లేపల్లి వెంకటరావు ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణకు సంబంధించి దేవస్థానం చేపడుతున్న ఏర్పాట్లను కె. కన్నబాబు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కియోస్క్ మిషన్ల పనితీరును పరిశీలించడంతో పాటు, 'మనమిత్ర' సేవ ద్వారా స్వయంగా టికెట్ బుక్ చేసి డిజిటల్ సేవల పనితీరును పరిశీలించారు. కొండ పైన మంచినీటి పాయింట్లను పరిశీలించి భక్తులకు తగినంత మంచినీరు అందుబాటులో ఉందా లేదా అనే విషయాన్ని స్వయంగా పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అన్నదానం భవనానికి వెళ్లే మార్గంలోని వాష్‌రూమ్‌లను కూడా స్వయంగా పరిశీలించి పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. దర్శనం పూర్తిచేసుకున్న భక్తులతో కె. కన్నబాబు నేరుగా మాట్లాడి దర్శనానికి ఎంత సమయం పట్టింది, దర్శన ఏర్పాట్లు ఎలా ఉన్నాయి, పారిశుద్ధ్య సదుపాయాలు, మంచినీటి వసతి తదితర అంశాలపై ఆరా తీశారు. దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాలు బాగున్నాయని భక్తులు వెల్లడించడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్వామివారి నిత్య అన్నప్రసాద భవనాన్ని సందర్శించిన ఆయన భక్తులతో కలిసి భోజన సదుపాయాలను పరిశీలించారు. భోజనం, కూరలు ఎలా ఉన్నాయని భక్తులను అడిగి తెలుసుకున్నారు. అన్నప్రసాదం సంతృప్తికరంగా ఉందని భక్తులు చెప్పడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు.



# పాఠశాల సమస్యలు పరిష్కరిస్తా...!

## సింహగిరి మార్కెట్ కమిటీ అధ్యక్షులు ముగ్గు కిరణ్

**సింహాచలం, జూలై 24, జయ జయహే :**

అపరిష్కృతంగా ఉన్న సమస్యలన్నింటినీ ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని సింహగిరి మార్కెట్ కమిటీ అధ్యక్షులు ముగ్గు కిరణ్ అన్నారు. సింహాచలం గోసాల వద్ద ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పేరెంట్స్ లేవనెత్తిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. స్కూల్లో మౌలిక సదుపాయాలు, అలాగే కొన్ని వసతులు, బౌ ండరీ వాల్ నిర్మాణం, ప్లే గ్రౌండ్, పిల్లలకి ఆట వస్తువులు తదితర పలు సమస్యలను సమావేశంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తెలియపచడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి క్రీడలను ప్రారంభించారు. విజేతలతో పాటు తల్లిదండ్రులకు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సమగ్ర వికాసానికి అవసరమైన పలు సూచనలు చేశారు. విద్యార్థులతో కలిసి పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసి, విద్యా ప్రమాణాల పెంపు కోసం విశేషంగా కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధి.. సమాజ అభివృద్ధికి తొలి అడుగు" అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఐ .ఆని పూర్ణిమ, సహో ఉపాధ్యాయులు జూ. మోహనరావు, అంగన్వాడి టీచర్ జి. శివరంజని, ప్రాథమిక పాఠశాల పేరెంట్స్ చైర్మన్ సత్యవతి , వైస్ చైర్మన్ బాషా, 98వ వార్డు బిజెపి ఇంచార్జీ వి. మహేష్, దాతలు పి.ఎస్.ఆర్. మూర్తి, గ్రామస్తులు నూకరాజు , తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### విద్యా శాఖ మంత్రి లోకేష్ ఆలోచన

# ప్రశంసనీయం

## పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ డే లో పూనెం శశికళ

**ఏలూరు /పోలవరం జయ జయహే**

మెగా పేరెంట్స్, టీచర్స్ పేరుతో ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే పూనెం సింగన్న దొర కోడలు పూనెం శశికళ పేర్కొన్నారు. పిల్లల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తూ వారిలో ఉత్సాహం రేకెత్తే విధంగా తల్లి తండ్రులకు ఆటలపోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయం అని కొనియడారు.గతం లో ఈ సంప్రదాయం లేదని విద్యా శాఖ మంత్రి లోకేష్ ఆలోచన ప్రశంస నీయమన్నారు. శుక్రవారం పోలవరం మండలం ఎల్ ఎన్ డి పేట వద్ద గల చేగొండపల్లి నిర్వాశితుల కాలనీ పాఠశాలలో జరిగిన ప్రేరెంట్స్, టీచర్స్ సమావేశం లో శశికళ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో తల్లులకు నిర్వహించిన మ్యూజికల్ చైర్స్ పోటీలలో గెలుపొందిన ముగ్గురికి ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతుల స్పాన్సర్ చేసి విజేతలకు అంద జేశారు.కార్యక్రమం లో భాగంగా శశికళ పాఠశాల లోజరుగుతున్న కార్య క్రమాలను ఆరా తీశారు. మధ్యాహ్నభోజనం ఎలా పెడుతున్నారు? విద్యా బోధన ఎలా వుంది?పాఠశాల పరిశుభ్రత తదితర అంశాలు గురించి తల్లి తండ్రులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసు కున్నారు.కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న పోలవరం ఎంపీ పి సుంకర వెంకటరెడ్డి ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు.ఈ సందర్భంగా తల్లి తండ్రులు ఉపాధ్యాయ బృందం ఎం పి పి వెంకటరెడ్డి, బహుమతీ ప్రదాత పూనెం శశికళ ను దుశాలువతో సత్కరించారు. తల్లి తండ్రులు హెచ్ ఎం లక్ష్మణ రావు తదితర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



### పేరెంట్స్ భాగస్వామ్యంతోనే

# పాఠశాలల అభివృద్ధి

## విద్యార్థుల అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

### డాక్టర్ కందుల నాగరాజు

**విశాఖపట్నం, జూలై 24, జయ జయహే :**

విద్యార్థుల అభ్యున్నతికి తల్లిదండ్రులు అలాగే అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం రైల్వే స్కూల్లో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్.సి.సి.క్యాడెట్స్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత భవిష్యత్ కి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకం కనుకనే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా మెగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసిందని తెలిపారు. విద్యార్థులకు తల్లి దండ్రులే తొలిగురువులన్నారు. వారి బంగారు భవిష్యత్తుకు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి సాధ్యమని చెప్పారు. విద్యార్థులు యుక్త వయస్సులో దారితప్పకుండా మంచి అలవాట్లను పాటిస్తూ బాగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు పునాది నుంచే సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. విద్యార్థులను తీర్చిదిద్దబడడానికి ఉపాధ్యాయుల స్ఫూర్తి ఎంత కీలకమో తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా ప్రధానమన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రపంచ దేశాల్లోని మెరుగైన విద్యా విధానాలను పరిశీలించి, రాష్ట్రంలో అమలు చేయడం ద్వారా ప్రభుత్వ స్కూల్స్ ని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులకు ఒత్తిడిలేని విద్యను అందిస్తూ, వారిలోని ప్రతిభను గుర్తిస్తే వారు ఉన్నంతంగా అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే స్కూల్ హెడ్మాస్టర్ వై.మీనాక్షి, కె.సాయి విమల, కుమారి, ఆర్.ప్రసన్న కుమార్, జె.ఏ.ఎస్ రాజా, ఇ.ఎం.సుశీల, ఏ.మణి పి.సుధ, జయ తదితరులు పాల్గొన్నారు.



# విమల విద్యాలయంలో ఘనంగా పేరెంట్ టీచర్ మీటింగ్

**ఉక్కునగరం, జూలై 24, జయ జయహే :**

విశాఖ విమల విద్యాలయంలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి దాదాపు 800 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు ,స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులంతా కలసి వందలాదిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా స్థానిక స్టీల్ ప్లాంట్ సిఐ కేశవరావు, గాజువాక బిజెపి కన్వీనర్ డాక్టర్ కరణం రెడ్డి నర్సింగరావు, స్టేట్ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ పెంటి రాజు, కార్మిక నాయకులు జెర్రిపోతుల మోహన్ కుమార్, విల్లా రామ్మోహన్ కుమార్, అగనంపూడి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బలి రెడ్డి సత్యనారాయణ, అమ్మ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ప్రతినిధులు అప్పలరాజు తదితరులంతా అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాల్యదశ నుండి విద్యాభ్యాసంతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ అలవర్చుకొని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దబడాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తల్లిదండ్రులు పూర్వ విద్యార్థులు అందరూ పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలతోనూ, తల్లిదండ్రులకు క్రీడా పోటీ నిర్వహించి బహుమతులు ఇచ్చి వైభవంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని అనిత వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమానికి పాఠశాల తరఫున పాఠశాల ప్రధాన కార్యదర్శి బి.సత్యనారాయణ , ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది అన్ని విధాల సహకరించి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి విందు భోజనం ఏర్పాటు చేయడం ద్వారా ఈ కార్యక్రమాని నిర్వహించారు.

# క్రమశిక్షణతో విద్యను అభ్యసించండి : కూరపాటి శంకర్ రెడ్డి

**పిచ్చాటూరు, జులై 24,జయ జయహే.**



క్రమశిక్షణ తో కూడిన విద్యనుఅభ్యశించాలని సత్యవేడు నియోజకవర్గం టీడీపీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి కోరారు .పిచ్చాటూరు ప్రభుత్వ పాఠశాల లో శుక్రవారం తల్లిదండ్రుల ,ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమం కు ముఖ్యఅతిదులుగా సత్యవేడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి,తిరుపతి పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు పనపాక లక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు విద్యలో మంచి స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఏడు మండలాలకు సంబంధించి తెలుగుదేశం మండల అధ్యక్షులు, క్లస్టర్లు,మార్కెటింగ్ కమిటీ చైర్మన్ లు,శ్రీ పల్లి కొండేశ్వరాలయ పాలక మండలి సభ్యులు నెల్సన్ మండేలా,నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# విశాఖ విద్యార్థులకు ప్రపంచస్థాయిలో ప్రత్యేక గుర్తింపు

## జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆకాంక్ష

### అడవివరం జడ్పీ హైస్కూల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

**విశాఖపట్నం, జూలై 24 , జయ జయహే**



విశాఖపట్నం పేరు ప్రపంచవ్యాప్తంగా వినిపిస్తోందని, ఇక్కడి విద్యార్థులు భవిష్యత్తులో ప్రపంచస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మూలవిరాట్‌లుగా ఎదగాలని ఆకాంక్షించారు. అందరి సహకారంతో విశాఖ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. అడవివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. తల్లికి వందనం పథకం కింద ఒక్కో విద్యార్థికి రూ.15 వేల చొప్పున అందించడం, విద్యారంగానికి ప్రభుత్వం సుమారు రూ.10 వేల కోట్లను కేటాయించడం ద్వారా విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చున్నారు. లీప్ యాప్ ద్వారా విద్యార్థుల చదువు, ఫలితాలు, అభ్యసన పురోగతిని తల్లిదండ్రులు తెలుసుకోవచ్చున్నారు. విద్యార్థుల్లో భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ప్రైవేట్ పాఠశాలలు, సంస్థలతో ఒప్పందాలు చేసుకుని విదేశీ భాషలను బోధించేలా చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. విద్యార్థిని వర్షిణి అభ్యర్థన మేరకు కొరియన్ తదితర విదేశీ భాషలను నేర్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు బాగా రాణించాలంటే తల్లిదండ్రులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు సమయం కేటాయించాలన్నారు. పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ కోరిన మేరకు సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరిస్తామని తెలిపారు. ఇటీవల పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ స్టడీ మెటీరియల్, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ కుమార్, సమగ్ర శిక్ష ఏపీసీ చంద్రశేఖర్, ఎంఈవో రవీంద్రబాబు, ప్రధానోపాధ్యాయుడు పైడిరాజు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు దుప్పట్లు, బూట్ల పంపిణీ

## ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

**శ్రీకాళహస్తి,జూలై 24,జయ జయహే:**




శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శుక్రవారం సందర్శించి,విద్యార్థినులకు ప్రభుత్వం తరఫున ఉచితంగా దుప్పట్లు,బూట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో సరదాగా ముచ్చటించి,వసతి గృహంలో అందుతున్న సౌకర్యాలు,భోజన నాణ్యతను అడిగి తెలుసుకున్నారు.వసతి గృహంలో విద్యుత్ విసనకర్రలు (ఫ్యాన్లు),నల్లబల్లల కొరత ఉందంటూ విద్యార్థినులు ఆయన దృష్టికి తీసుకురాగా,వారం రోజుల్లోగా వాటిని ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.వసతి గృహాల్లో ఉండే పేద విద్యార్థినులకు ఎలాంటి లోటు లేకుండా,వారి చదువుకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే తమ కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,వసతి గృహ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహే

# కంఠబంసుగూడ బాలికల పాఠశాలలో ఘనంగా మెగా పీటీఎం

## హాజరైన అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం






**అరకులోయ: జూలై 25,జయ జయహే**

మండల కేంద్రంలోని కంఠబంసుగూడ బాలికల పాఠశాలలో మెగా పిటిఎం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అరకు శాసనసభ్యులు రేగం మత్స్యలింగం పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పండుగలు, సెలవులు మినహా మిగిలిన కాలమంతా విద్యార్థులు ఉపాధ్యాయుల పర్యవేక్షణలోనే ఉంటున్నందున, వారి ప్రవర్తన చదువులో వచ్చే మార్పులను ఉపాధ్యాయులు స్పష్టంగా గమనించగలరు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య స్నేహపూర్వక ఆలోచనా విధానాన్ని పెంపొందించడమే ఈ సమావేశ ముఖ్య ఉద్దేశం. తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో సత్సంబంధాలు కలిగి ఉండి, వారి సూచనలు పాటిస్తే పిల్లల భవిష్యత్తును విజయవంతంగా తీర్చిదిద్దవచ్చని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ సూపర్ 50 కి వెళ్తేనే మార్కులు వస్తాయనే అపోహను తొలగించి, మా పాఠశాలలోనే ఉండి 500 మార్కులకు పైగా సాధించేలా ఉపాధ్యాయులు అహర్నిశలు శ్రమించారు. ఉపాధ్యాయుల కృషి, ఉత్తీర్ణత శాతం: తెలుగు, హిందీ, ఇంగ్లీష్ మ్యాథ్స్ ఉపాధ్యాయుల కృషితో విద్యార్థులు అత్యధిక శాతంలో ఉత్తీర్ణత సాధించి అద్భుతమైన ఫలితాలను అందించారు. విద్యార్థుల విజయం చూసి తల్లిదండ్రుల ముఖాలలో వెల్లివిరిసిన సంతోషం వర్ణనాతీతం."పుత్రుని కనుగొని నలుగురు పొగడగ పుత్రోత్సహంబునాడు పొందర సుమతీ" అన్నట్లుగా, నలుగురి ముందు పిల్లలు ప్రశంసలు పొందడమే తల్లిదండ్రులకు నిజమైన ఆనందం అని ఆమె అన్నారు. పాఠశాలలో భోజన వసతులు, క్రమశిక్షణ వంటి అంశాలను వార్డెన్లు ఎంతో శ్రద్ధతో పర్యవేక్షిస్తున్నారని పేర్కొంటూ, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అరకులోయ, డుంబ్రిగూడ మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు స్వాభి రామ్మూర్తి, పాంగి పరుశురాం, సీనియర్ నాయకులు కే.అశోక్, జె. నరసింగరావు, నాగేశ్వరరావు, జగబందు, ఎస్ఎంసి చైర్మన్, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గిరి ప్రదక్షిణ భక్తులకు రోటరీ వైద్య సేవలు

## అంబులెన్స్‌తో పాటు 12 గంటల పాటు నిర్విరామ సేవలు

**విశాఖపట్నం, జూలై 24, జయ జయహే**

సింహాచల గిరిప్రదక్షిణ లో పాల్గొనే వేలాది మంది భక్తులకు వివిధ వైద్య సేవలు అందించేందుకు రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ సన్నాహాలు చేస్తుందని రోటరీ ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ సిహెచ్ కిషోర్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రోటరీ క్లబ్ ప్రతినిధులతో కలిసి పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో చేపట్టనున్న సేవా కార్యక్రమాలను రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ప్రెసిడెంట్ సిహెచ్. కామేశ్వరరావు, సెక్రెటరీ కె.ఎం.కె. రమేష్, కమ్యూనిటీ సర్వీసెస్ (మెడికల్) డాక్టర్ అశోక్ దేవరకొండ, ప్రాజెక్టు కోఆర్డినేటర్ విజ్జపు ప్రవీణ్ కుమార్ వివరించారు. సుమారు 30 మంది తో మూడు వైద్య బృందాలుగా 28వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుంచి 12 గంటల పాటు నిర్విరామంగా వైద్య సేవలను అందించనున్నారు. ముఖ్యంగా కాళ్ల నొప్పులు, వాపులు నివారించేందుకు ఔషధ స్ప్రేలను ఉచితంగా అందజేస్తారు. అస్వస్థతకు గురైన వారికి ప్రథమ చికిత్స తో పాటు అత్యవసర సమయంలో మెరుగైన వైద్య సహాయం కోసం ఆసుపత్రి తరలించేందుకు అంబులెన్స్ సదుపాయం కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సేవలందించేందుకు పలువురు ఫిజియోథెరపిస్టులు ముందుకు వచ్చారని వివిధ సంస్థల సహకారంతో పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీ హెల్త్ కేర్, స్నేహ సంధ్యా ఏజ్ కేర్ ఫౌండేషన్, డి.డి.ఆర్. ఇన్స్టిట్యూషన్స్, ఎరుమేలి అయ్యప్ప అన్న సమారాధన ట్రస్ట్ సంస్థల సహకారాన్ని అందిస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ట్రెజరర్ ప్రభు జనార్ధన్, క్లబ్ ఆఫీసర్స్ ఎండి.యాసిన్ బాబా, జి కృష్ణమూర్తి, బి భాస్కర్, కోటేశ్వరరావు, బి శంకర్రావు, కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.






# కేంద్ర గ్రంథాలయంలో అయ్యంకి జయంతి వేడుకలు

**విశాఖపట్నం, జూలై 24, జయ జయహే**

పౌర గ్రంథాలయ రంగంలో ప్రగతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 137వ జయంతి వేడుకలు శుక్రవారం కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు వన్నెంరెడ్డి సతీష్ కుమార్ మాట్లాడుతూ అయ్యంకి వెంకటరమణయ్య గ్రంథాలయాల పట్ల రచించిన రచనలు కూడా ప్రతి ఒక్క పాఠశాలలోనూ కళాశాలలోనూ ప్రదర్శించాలన్నారు. ఆయన చేసిన త్యాగాలను గుర్తించే విధంగా ఆయన జయంతిని గుర్తించాలని పిలుపునిచ్చారు. 1911లో పౌర గ్రంథాలయ రంగంలో ప్రవేశించి 1914లో దేశంలోని తొలుత ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘాన్ని 1919లో అఖిల భారత పౌర గ్రంథాలయ సంఘాన్ని ప్రారంభించారని, దేశంలో వివిధ రాష్ట్రాల్లో గ్రంథాలయ సంఘాల స్థాపనకు ప్రోత్సహించారని కొనియాడారు. 1930 దశకంలో ప్రజల భాగస్వామితో గ్రంథాలయాల యాత్రను నిర్వహించి, తన సొంత ఖర్చులతో గ్రామ గ్రామాన తిరిగి గ్రంథాలయ జ్యోతిని వెలిగించిన త్యాగమర్తిగా పేర్కొన్నారు. దాదాపు ఏడు దశాబ్దాల పాటు నిరంతరంగా గ్రంథాలయ సేవలు అందించారని, ఆయన కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో గౌరవించిందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం కేంద్ర గ్రంథాలయ గ్రంథ పాలకులు మరియు వివిధ శాఖల గ్రంథపాలకులు పాల్గొని జయప్రదం చేశారు



# తల్లిదండ్రులు భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి సాధ్యం

**విజయనగరం,శుక్రవారం, జులై 24:(జయ జయహే )**

విజయనగరం, కామాక్షి నగర్, ప్రస్తుత 42వ డివిజన్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-102 గవర్నర్ ఎ.తిరుపతిరావు మరియు ప్రముఖ సామాజిక కార్యకర్త, జనసేన పార్టీ సీనియర్ నాయకులు త్యాడ రామకృష్ణారావు(బాలు)..ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి సాధ్యమని, ఉన్నత పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం మెగా తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాల నుంచే అనేక మంది ఐఏఎస్‌లు, ఏపీఎస్‌లు, ఇంజనీర్లు, డాక్టర్లు అయ్యారన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులపై ఒత్తిడి పెంచవద్దని, వారికి ఇష్టమైన విద్యనే చదివించాలన్నారు. పాఠశాలల్లో టీచర్ల కొరత తీర్చేందుకు మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులను కూటమి ప్రభుత్వం భర్తీ చేస్తోందన్నారు.

# జాయింట్ స్టాఫ్ సమావేశాలకు ఔట్సోర్సింగ్ జేఏసీని ఆహ్వానించాలి

## ఏపీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెండ్ జి. మహేంద్ర బాబు

**విశాఖపట్నం, జూలై 24, జయ జయహే :**



జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలకు ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీని ఆహ్వానించాలని ఏపీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెండ్ జి. మహేంద్ర బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వంలోని వివిధ శాఖలు, కార్యాలయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు మరియు స్థానిక సంస్థల్లో లక్షలాది మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కీలక పాత్ర పోషిస్తున్నా...వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే అధికారిక వేదికలో వారికి ప్రాతినిధ్యం లేకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, సేవా పరిస్థితులు, ఉద్యోగ సంబంధిత అంశాలపై చర్చించే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలకు ఆంధ్రప్రదేశ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ (రిజి. నెం. 393/2025)లకి గుర్తింపు ఇచ్చి ఆహ్వానించడం అత్యంత అవసరమన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల అసలు సమస్యలు ప్రభుత్వ దృష్టికి చేరాలంటే, వారి తరఫున మాట్లాడే గుర్తింపు పొందిన సంఘానికి అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. నేడు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, సర్వీస్ రూల్స్ లేకపోవడం, వార్షిక ఇంక్రిమెంట్లు లేకపోవడం, పీఆర్సీ ప్రయోజనాలు అమలు కాకపోవడం, సమాన పనికి సమాన వేతనం అమలు కాకపోవడం, సెలవుల విషయంలో వివక్ష వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఈ అంశాలు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాల్లో చర్చకు రావాలంటే ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రాతినిధ్యం తప్పనిసరి అని వెల్లడించారు. తమ న్యాయమైన డిమాండ్‌పై ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకుని, ఇకపై జరిగే ప్రతి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీని అధికారికంగా ఆహ్వానించి, మా సమస్యలు వివరించే అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను వినకుండా, వారి ప్రతినిధులను చర్చలకు దూరంగా ఉంచడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా భావిస్తామని, ప్రభుత్వం మా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల గొంతును వినాలని, మా సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపాలని కోరారు. అదే ఉద్యోగుల సంక్షేమానికి, ప్రభుత్వ పరిపాలనకు మైలు రాయిగా నిలుస్తుందన్నారు.

# పిల్లలే మన భవిష్యత్ ఆస్తి.. పిల్లలు పుడితే భారం కాకుండా చేశాం

## ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం అమలు

## విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దే బాధ్యత టీచర్లది

## రంపచోడవరంలో తల్లిదండ్రుల,ఉపాధ్యాయుల భేటీలో సిఎం చంద్రబాబు

**రంపచోడవరం,జూలై24 జయ జయహే**




పిల్లలు ఆనందంగా చదువుకోవడానికి ఏర్పాట్లు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రంపచోడవరంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల కొరత లేదన్నారు. విద్యా వ్యవస్థకు ఉపాధ్యాయులే వెన్నెముక అని అన్నారు. తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులను ప్రయోజకులుగా చేయడం టీచర్ల బాధ్యతన్నారు. పిల్లలందరికీ పౌష్టికాహారం ఇస్తున్నామని తెలిపారు. పీ4 కార్యక్రమంలో పేదవారిని ఆదుకునేలా కృషి చేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో పిల్లలే ఆస్తి అని సీఎం తెలిపారు. పిల్లలు పుడితే భారం కాదని.. ఆదాయంగా మార్చేశామని ముఖ్యమంత్రి చెప్పారు. ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం డబ్బులు ఇస్తున్నామన్నారు. 67 లక్షల మంది పిల్లలకు రూ.10,120 కోట్లు జమ చేస్తున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లోనే 5 లక్షల మందికి రూ.664 కోట్లు జమ చేస్తున్నామన్నారు. గిరిజనులకు ఐటీలో ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. ఆగస్టు నుంచి సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ప్రతి ఇంటికీ సోలార్ ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఆర్థిక అసమానతలు తగ్గించి జీవన ప్రమాణాలు పెంచుతామని వెల్లడించారు. పది లక్షల కోట్లు అప్పులు ఉన్నా.. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. విద్య పైనే ఎక్కువ దృష్టి సారించినట్లు తెలిపారు. పీటీఎం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అనుసంధానం చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. భవిష్యత్తులో పిల్లలే ఆస్తి. పిల్లలు పుడితే భారం కాదు.. ఆదాయంగా మార్చేశాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గిరిజన ప్రాంతాల్లోనే 5లక్షల మందికి రూ.664 కోట్లు వారి ఖాతాల్లో వేశామని చెప్పారు. ఆర్థిక అసమానతలు తగ్గించాలని ధ్యేయంగా పెట్టుకున్నాం. సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తూనే అభివృద్ధిని నడిపిస్తున్నాం. పీ4 కార్యక్రమంతో పేదవారిని ఆదుకునేలా కృషి చేస్తున్నాం. అప్పులు కాదు.. ఆదాయాన్ని పెంచాలి. పిల్లలు సమాజానికి ఉపయోగపడాలి. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉంది. విద్యా వ్యవస్థకు వెన్నెముక ఉపాధ్యాయులు. సమాజంలో టీచర్లకు మంచి గుర్తింపు ఉంది. శనివారం నో బ్యాగ్ డే అమలు చేస్తున్నాం. పిల్లలు ఆనందంగా ఉంటే బాగా చదువుతారు. అందుకే వారికి పౌష్టికాహారం అందిస్తున్నాం. ఆగస్టు నుంచి సంజీవని ప్రాజెక్టు రాబోతోందని సీఎం తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆ దిశగా ఇప్పటికే బలమైన అడుగులు వేస్తున్నామని చెప్పారు. తల్లికి వందనం ఆర్థికసాయం మాత్రమే కాదని.. తల్లిని, గురువును గౌరవించడమే దీని అసలు లక్ష్యమని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 43 వేల పాఠశాలల్లో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి చర్చించేందుకు ఏర్పాటు చేసిన వేదిక ఈ మెగా పీటీఎం అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకొస్తానని సీఎం చంద్రబాబుకు హామీ ఇచ్చానని.. అది తన ఒక్కడి వల్లే సాధ్యం కాదన్నారు. దీనికోసం తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు అనుసంధానం కావాలని చెప్పారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com